



# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక






కర్నూలు సంపుటి : 03, సంచిక : 359 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ శనివారం - 05 - సెప్టెంబర్- 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,


## ‘వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది’

- ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్
- అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక
- హర్మూజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి



అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. మిగతా 2లో

## నీటి సంరక్షణ సాంకేతికతలపై దృష్టిసారించాలి

- పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రతరంకాకుండా జల సంరక్షణ సాంకేతికతలను మరింతగా అమల్లోకి తేవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.
- జలంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన జాతీయస్థాయి రెండు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు.



న్యూఢిల్లీ: పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రతరంకాకుండా జల సంరక్షణ సాంకేతికతలను మరింతగా అమల్లోకి తేవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మిగతా 2లో

## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం



- తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రతి విషయంలోనూ మోసం చేసిన ‘420 ప్రభుత్వం’గా మిగిలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.
- ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు కోసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు.

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రతి విషయంలోనూ మిగతా 2లో

## తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి
# చర్యలు చేపట్టాలి

### ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

- ★ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- ★ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని వినతి
- ★ ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం మరో 750 ఎకరాల భూసేకరణకు సిద్ధమని వెల్లడి
- ★ డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు దేవరకద్ర వద్ద 416 ఎకరాల భూకేటాయింపునకు హామీ
- ★ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతోనూ సీఎం భేటీ
- ★ సాగు ప్రాజెక్టుల కార్యసాధకుడు వైఎస్సార్
- ★ ఉమ్మడి ఏపీలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం, ప్రాణహిత--చేవెళ్ల పనులు
- ★ ఆయన కలగన్న ప్రాణహిత, కల్వకుర్తి,ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- ★ డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అవార్డు ప్రదాన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ★ ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు అందించిన ఖర్గే



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం రాజ్‌నాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు. మిగతా 2లో

## అనకాపల్లికి గోదావరి జలాల పేరుతో చంద్రబాబు డ్రామా



- పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరిచ్చామంటూ ఆర్భాటం
- పోలవరం ఎత్తు 41 మీటర్లకు కుదింపు
- అలా ఉత్తరాంధ్రకు ద్రోహం చేసిన చంద్రబాబు
- భూములు కార్పొరేట్లకు. సాగునీరు ప్రైవేట్ సంస్థలకా?
- మరి అనకాపల్లి జిల్లా రైతుల పరిస్థితి ఏమిటి?
- సూటిగా ప్రశ్నించిన మాజీ ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి
- పోలవరం డ్యామ్ పూర్తి కాకుండా నీటి విడుదలేమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల చేశామని చెప్పడం పచ్చి బూటకమని, ఇది ప్రజలను నిలువునా మోసం చేయడమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. అనకాపల్లికి గోదావరి జలాలు అంటూ, సీఎం చంద్రబాబు నానా హంగామాతో పెద్ద డ్రామా చేశారని అనకాపల్లిలోని వైయస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడిన మిగతా 2లో

## ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు
# వైసీపీ కుట్రలు పన్నుతోంది

### అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి సమావేశమయ్యారు.



రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, మిగతా 2లో

## చెన్నైలో ‘ఒలింపిక్ సిటీ’.. ఫార్ములా-1 ట్రాక్.!



- రూ. 1,200 కోట్లతో వందేళ్లు నిలిచేలా కొత్త సెక్రటేరియట్
- తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయాలతో దూసుకు పోతున్నారు.
- తాజాగా చెన్నైలో కొత్త శాసనసభ - సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయాలతో దూసుకు పోతున్నారు. తాజాగా చెన్నైలో కొత్త శాసనసభ మిగతా 2లో

## ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా చెప్పుకునే అవకాశం ఇస్తారు

### కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్

- ‘రేవంత్ ఎప్పటికీ వైఎస్సార్ కాలేడు’: కాంగ్రెస్‌లో కొనసాగడంపై కొండా సురేఖ స్పష్టత
- దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
- ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు.



దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మిగతా 2లో

## లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి



- డీఎస్సీలో అక్రమాల బండారం బయటపడిందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు.
- స్పోర్ట్స్ కోటా, పేపర్ లేకేజి ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.
- గురువారం విశాఖలో వరుదు కళ్యాణి మీడియా సమావేశం నిర్వహించారు.

డీఎస్సీలో అక్రమాల బండారం బయటపడిందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. మిగతా 2లో

## సోషల్ మీడియాలో
# జెన్ జీ క్రియాశీలకం

### ఆ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: సీఎం చంద్రబాబు

- అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు
- సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం..అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో
- నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు
- భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం
- ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
- ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు.
- ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిగతా 2లో

## ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



- సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ సమావేశం..పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా సుదీర్ఘ చర్చ
- అమరావతి:రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

అమరావతి:రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, మిగతా 2లో

## 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'

అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. "వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది" అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు.హర్మూజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హర్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

## నీటి సంరక్షణ సాంకేతికతలపై దృష్టిసారించాలి

జలంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన జాతీయస్థాయి రెండు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. "పట్టణీకరణతో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. వీళ్ల అవసరాలు తీర్చేలా పట్టణ పురపాలికలు నీటి సంరక్షణపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ మేరకు నీటి సంరక్షణ సాంకేతికతల అమలుపై బాగా దృష్టిసారించాలి. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న అత్యుత్తమ నీటి సంరక్షణ విధానాలు,సాంకేతికతలను నగర, పట్టణ కార్పొరేషన్లలో అమలుచేయాలి. ఈ సాంకేతికతలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చేలా, సంబంధిత ఉపకరణాలను స్థానికంగా తయారుచేసేలా భారతీయ పరిశ్రమలకు అవకాశాలను మెరుగుపరచాలి. జల సంరక్షణలో ప్రజా భాగస్వామ్యాన్నీ విపరీతంగా పెంచాలి. పౌరుల్లో నీటిపై, నీటి వృథాను అరికట్టడంపై, నీటిని పొదుపుగా వాడుకోవడంపై మరింతగా అవగాహన పెంచేలా జల్‌ఉత్సవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలి. పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, కాలువలు, రిజర్వాయర్లలో చెత్త, వ్యర్థాల పూడిక తీసే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టాలి. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషిచేయాలి. ఈ సదస్సును ఒకసారి చేపట్టేసి చేతులు దులుపుకోవడం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలి. జల సంరక్షణ విజయవంతంగా చేపడుతున్న ప్రాంతాలను ఉన్నతాధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రాలకతీతంగా సందర్శించి అవగాహన పెంచుకోవాలి. జల వనరులను ఎలా సంరక్షించుకోవాలో, సదీ?వనియోగం చేయాలనే దాని కోసం జల గణాంకాలను కృత్రిమ మేథ సాయంతో మేళవించి మెరుగైన పరిష్కారాలను కనుగొనాలి"అని మోదీ సూచించారు.

## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం

మోసం చేసిన '420 ప్రభుత్వం'గా మిగిలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు కోసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు.. ఇలా ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తెచ్చారని, ఆరు డీఏలు, పీఆర్సీ, ఈహెచ్‌ఎస్ చెల్లింపుల్లో కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతులకు ఎకరానికి రూ.15 వేల సాయం, ఏటా 2 లక్షల ఉద్యోగాలు, రూ.4,000 నిరుద్యోగ భృతి హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు ఇస్తామన్న హామీని నీరుగార్చారని, కుల గణన పేరుతో ముస్లింలను బీసీల్లో చేర్చి అసలైన బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు.

### అనకాపల్లికి గోదావరి జలాల పేరుతో చంద్రబాబు డ్రామా

పార్టీ నేతలు ఆక్షేపించారు. అసలు పోలవరం డ్యామ్ నిర్మాణం పూర్తి కాకుండా, రిజర్వాయర్‌లో అసలు నీటి నిల్వలే లేకుండా నీటిని విడుదల చేశామంటూ జలహారతులు ఇవ్వడం కేవలం ప్రచార ఆర్భాటం, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తప్ప మరొకటి కాదని వారు స్పష్టం చేశారు. పోలవరం కాలువల తవ్వకం నుంచి భూసేకరణ, అనుమతుల వరకు 80 శాతం పనులను పూర్తి చేసిన ఘనత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని, ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాల వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, ఇప్పుడు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా తెచ్చిన గోదావరి జలాలను పోలవరం నీళ్లుగా చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో నడుస్తున్నది పాలన కాదు, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఈవెంట్ మేనేజ్‌మెంట్ మాత్రమే. పోలవరంలో 2014--19 మధ్య చంద్రబాబు చేసిన డిజైన్ లోపాలు, డయాఫ్రమ్ వాల్ వైఫల్యాలను సరిదిద్దడానికే జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. నాడు సాక్షాత్తూ ప్రధాని మోదీ గారే పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించారు. ఎడమ కాలువ కోసం 6200 ఎకరాలు, కుడి కాలువ కోసం 6000 ఎకరాల భూసేకరణ జరిపి, 80 శాతం కాలువ పనులు పూర్తి చేసింది దివంగత నేత వైఎస్సార్. 193 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 38 లక్షల ఎకరాలకు నీరివ్వాలన్నది వైఎస్సార్ లక్ష్యం. కానీ చంద్రబాబు 2024లో కేంద్రం వద్ద మోకరిల్లి ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడానికి అంగీకరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును నిలువునా సమాధి చేశారు.పోలవరంలో 45 మీటర్ల నీరు నిలబడితేనే గ్రావిటీ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు వస్తుంది.అనకాపల్లి జిల్లాలో 55 వేల హెక్టార్లలో వరి సాగు జరగాల్సి ఉండగా, తీవ్ర వర్షాభావం వల్ల సెప్టెంబర్ నాటికి కేవలం 5 వేల హెక్టార్లలోపే నాట్లు పడ్డాయి. అలాంటి పరిస్థితుల్లో జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి, అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాల్సింది పోయి జగన్ గారిపై విషం చిమ్మడానికే సమయం కేటాయించారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించలేకపోయారు. నర్సీపట్నంలో 30 శాతం పనులు పూర్తయిన మెడికల్ కాలేజీని నిలిపివేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, గ్రీన్ హైడ్రోజన్ హబ్, విజయనగరం మెడికల్ కాలేజీలను జగన్ గారు తీసుకొస్తే... చంద్రబాబు మాత్రం ఉత్తరాంధ్రను దోచుకోవడానికే పరిమితమయ్యారు.

## లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి

స్పోర్ట్స్ కోటా, పేపర్ లేకేజి ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం విశాఖలో వరుదు కళ్యాణి మీడియా సమావేశం నిర్వహించారు. కర్నూలు ప్రభాకర్ గౌడ్ కు టెట్ అర్హత లేకుండా టీచర్ పోస్ట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. చర్చకు రావాలని సవాల్ విసరడం కాదు దమ్ముంటే డీఎస్సీ అంశంపై ఇప్పుడు మాట్లాడాలి. వైఎస్సార్సీపీ మొదటి నుంచి చెబుతున్నదే నిజమైంది. డీఎస్సీలో ఇంకెన్ని అక్రమాలు జరిగాయో తేలాలని స్పష్టం చేశారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చెయ్యాలని ఈ అంశంపై సీఎం చంద్రబాబు దీనిపై స్పందించాలని వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు..

## ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన టూరిజం డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ మీటింగ్ లో ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా జిల్లా స్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు.. జిల్లాల నుండి అందిన 28 ప్రతిపాదనలకు అనుగుణంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు రూపకల్పన చేయాలన్నారు. సెప్టెంబర్ 27న 'వరల్డ్ టూరిజం డే' వేడుకల నిర్వహణ, రాబోయే గోదావరి పుష్కరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ తరఫున అత్యాధునిక టెంట్ సిటీల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశవిదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులు, పర్యాటకుల కోసం రూపొందించిన విస్తృత స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యాచరణను అధికారులు మంత్రి దుర్గేష్ కు అందించారు. యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, సర్క్యూట్ మ్యాప్స్, ఆకర్షణీయమైన బ్రోచర్లు, సమగ్ర వివరాలతో కూడిన కంటెంట్ తయారు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రాశస్త్యాన్ని,పరివాహక అధ్యాత్మిక ప్రాంతాల ప్రాధాన్యతను, చారిత్రక ఘాట్ల విశిష్టతను చాటేలా వినూత్న డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా ప్రచారాలు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. టూర్ ఆపరేటర్లతో ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, హోటల్ అండ్ హాస్పిటాలిటీ వర్క్‌షాప్‌ల ఏర్పాటుపై అధికారులు సూచించగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవిసుభాష్, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, సినిమాటోగ్రఫీ ఎండీ విశ్వనాథన్, ఏపీటీఏ సీఈవో శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, చీఫ్ మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులు పద్మారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారిద్దరూ చర్చించారు.

డిఫెన్స్ ఎక్స్‌పోలో లైవ్ డెమోలు...

ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సుతోపాటు ఎయిర్ షో, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన లైవ్ డెమోలు డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌కు వివరించారు. ఈ దృష్ట్యా డిఫెన్స్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని, ఆహూతులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎయిర్ షో నిర్వహణకు గగనతల అనుమతుల మంజూరు చేయాలని.. యుద్ధ విమానాల భాగస్వామ్యంతో పాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా మద్దతు అందించాలన్నారు. త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థల డెమోలను ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేయాలని కోరారు.

రక్షణ శాఖ కోరినట్లుగా భూసేకరణ...

ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ గురించి రాజ్‌నాథ్ సింగ్, రేవంత్‌రెడ్డి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్ చెప్పారు. ఈ విమానాశ్రయం కోసం రక్షణ శాఖ మొత్తం 1,500 కోరిందని.. ఆ మేరకు మరో 750 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు.

విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలి...

ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం ఆయన్ను పార్టీ ఎంపీలు, అధికారులతోపాటు వెళ్లి కలిశారు. మామూనూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే విషయంలో తుది నిర్ణయానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో ఆహ్వానిస్తామని చెప్పారు. డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ కోరారు. హుస్సేన్‌సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన అధికారులు సీఎంకు తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల కార్యసాధకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డేనని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. పోలవరం, ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుల పనులను వైఎస్సారే ప్రారంభించారని గుర్తుచేశారు. తెలంగాణ రైతుల కష్టాలు తీర్చేందుకు ఆయన తలపెట్టిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుతోపాటు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ప్రస్తుతం ఆగిపోయాయని.. అయితే ఆయన కలగన్న ఆ ప్రాజెక్టులను పూర్తిచేసి తెలంగాణ ప్రజలకు అంకితమిస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ జీవితాంతం ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించారని.. 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు ఎర్రటి ఎండల్లో సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించిన ఆయన నాడు ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ముఖ్యంగా కాలిపోతున్న మోటార్లు, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, ఎండిపోతున్న పంటలతో అష్టకష్టాలు పడుతున్న రైతులకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చి 2004లో సీఎం అయ్యాక ఆ పథకంపై తొలి సంతకం చేసి మాట నిలబెట్టుకున్న మహనీయుడని ప్రశంసించారు. దాదాపు రూ. 1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడమే కాకుండా అప్పటికి రైతులపై ఉన్న వేలాది అక్రమ కేసులన్నింటినీ తొలగించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు.

## సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం

ప్రభుత్వానికి సంబంధించిన శంకు స్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపో వడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని అన్నారు.సమన్వయ లోపంతో వివిధ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుండటంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవటం సరికాదన్నారు. వెలిగొండ, పోలవరం ఎల్‌ఎంసీ ప్రకటనల్లో మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. తప్పులు పునరావృతం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రారంభానికి జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో పని చేశాయన్నారు. రామానాయుడు సింప్లిసిటీ మెయింటైన్ చేస్తూ పని బాగా చేశారంటూ అభినందించారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని.. ఆంధ్ర పాప్ కార్న్, అరకు కాఫీ ప్రతి గ్రామానికి విస్తృతంగా వెళ్లాలని సూచించారు.ఏపీలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ ఈరోజే కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదిద్దామన్నారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం మేర లోటు వర్షపాతం ఉందన్నారు. గత 30ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం ఈసారి నమోదైందని చెప్పారు. తాగునీరు అందించటం, పశుగ్రాసానికి లోటు లేకుండా చూడటం, సీడ్ బాల్స్ విషయంలో మంత్రులంతా కార్యోన్ముఖులై పని చేయాలని సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవకాశం ఉన్న చోట నీటి స్టోరేజ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు.గ్రౌండ్ వాటర్‌ను అంచనా వేస్తూ అవసరం అనుకుంటే అదనంగా బోరు వేసేందుకు అనుమతినిద్దామని ముఖ్యమంత్రి అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా కూడా ఎండటానికి వీల్లేదన్నారు. తాగు నీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రతి మంత్రివర్గంలో ఎల్‌నినో ప్రభావంపై సమీక్షిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. 'మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి. కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉంది. వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి' అని సూచించారు.వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా వైసీపీ సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తైనా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు.

## ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది

పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందని లోకేశ్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని లోకేశ్ తెలిపారు. ముందుగా మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు జరిగేలా శ్రమిస్తున్నామని తెలిపారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.ఎన్నికలు వాయిదా పడాలంటూ ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుయుక్తులు, కుట్రలు ఎట్టిపరిస్థితుల్లోనూ పారవని లోకేశ్‌హెచ్చరించారు. ఎన్నికలు వాయిదా పడితే కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయనే దురుద్దేశంతోనే ప్రతిపక్షం కోర్టు కేసులతో అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే ప్రభుత్వం చట్టపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి, అనుకున్న సమయానికే స్థానిక ఎన్నికలను పూర్తి చేసి తీరుతుందని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా చెప్పుకునే అవకాశం ఇస్తారు

శిక్షించారని అన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత పటేల్ వ్యాఖ్యలకు తనను శిక్షించడం ఏంటని.. ఆమె అభిప్రాయంతో తనకేం సంబంధమని కాంగ్రెస్ పెద్దలను సురేఖ సూటిగా ప్రశ్నించారు. రాజీనామా చేయమంటే చేసేదాన్నని, తన వివరణ అడిగి చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా పర్వాలేదని కొండా సురేఖ చెప్పుకొచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. 'మంత్రి పదవి నాకు ఆభరణం మాత్రమే. కారణం చెప్పకుండా తొలగించడం బాధాకరం. గతంలో మంత్రి పదవికి స్వయంగా నేనే రాజీనామా చేశా. ప్రస్తుతం మంత్రులు సంతోషంగా లేరు. ఈ విషయం గుండెపై చేయి వేసుకొని వారు చెప్పాలి. మంత్రులంతా బయటకు వచ్చి మాట్లాడాలి. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతున్నాను. నేను పార్టీని, ప్రభుత్వాన్ని ఏం అనలేదు. మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని తిట్టినవారే. ఇందిరాగాంధీని జైపాల్ రెడ్డి తిట్టారు. రోశయ్య సైతం ఇందిరాగాంధీని తిట్టారు. సీఎం రేవంత్‌పై ఆరోపణలు చేసిన వారికీ పదవులు ఇచ్చి సన్మానం చేశారు.ఎవరి అండ లేకుండా మేం పైకి వచ్చాం. నా భర్తను కారులో ఎక్కించుకొని వరంగల్ అంతా తిప్పారు. మా కాళ్లు మొక్కి మాతో ప్రచారం చేయించుకున్న వాళ్లూ మమ్మల్ని తిడుతున్నారు. మా నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్సీకి వాళ్ల భార్య కూడా ఓటేయదు. నన్ను తొలగించాలనే ఆలోచన ఏఐసీసీకి లేదు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేశారు. వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై నన్ను ఇబ్బంది పెట్టారు. డబ్బులు వసూలు చేసిన వాడే నా మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు పెట్టాడు. సుమంత్ పేరు చెప్పి కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. తమ ప్రభుత్వంలో తమ మనుషులను ఇబ్బంది పెట్టుకోవడం చరిత్రలో ఎక్కడా లేదు. సుమంత్‌ని ఇబ్బంది పెట్టడం ఆపేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. కాంగ్రెస్ సర్కార్ సరిదిద్దుకోవాల్సిన, మార్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి.ప్రభుత్వం మళ్లీ రావాలంటే చాలా మార్పులు జరగాలి. మోనోపాలీ లాగా వెళ్లడం సరైంది కాదు. తనకు తానే ముఖ్యమంత్రి అని చెప్పుకోవడం సరికాదు. నిర్ణయాలు తీసుకునేప్పుడు చర్చించాలి. ఎమ్మెల్యేగా ఉంటాను.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను. నాకు పార్టీలో ఇబ్బంది అవుతుందని అనుకుంటున్నా. నా కూతురు వ్యాఖ్యలను నేను ఖండిస్తే ఆమెను కించపరిచినట్టు అవుతుంది. మంత్రిగా తొలగించడం అవమానమని అనుకోవడం లేదు. నేను తప్పు చేస్తే ఇబ్బంది పడేదాన్ని. తప్పు చేయకుండా బర్తరఫ్ చేయడం పార్టీ తప్పు. రేవంత్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తేడా ఉంది' అని అన్నారు.కేబినెట్ నుంచి తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా తనపై వేటు వేశారని, కనీసం వివరణ తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ఆయన పరిపాలనా శైలిపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో నాయకులకు, ప్రజలకు నిరంతరం ప్రాధాన్యం ఉండేదని కొండా సురేఖ గుర్తుచేశారు. ప్రజలతో, పార్టీ నేతలతో వైఎస్సార్ ఉన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డికి అసలు కమ్యూనికేషన్ లేదని.. ఆయన నాయకులతో సరిగ్గా మమేకం కావడం లేదని విమర్శించారు. "నేను ఎలాంటి తప్పూ చేయకున్నా నన్ను పదవి నుంచి బర్తరఫ్ చేశారు.

## చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్.!

- సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్మాణం రాబోయే 100 సంవత్సరాల వరకు ఉపయోగ పడేలా ఉంటుందని ఆయన తెలిపారు.అసెంబ్లీలో రూల్ 110 కింద అనేక ప్రకటనలు చేస్తూ, తమిళనాడు ఒలింపిక్ సిటీని, చెన్నైలో మోటార్ స్పోర్ట్స్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సీఎం ప్రకటించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయికి పెంచడానికి ముఖ్యమంత్రి మూడు ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించారు.ప్రస్తుతం ఫోర్ట్ సెయింట్ జార్ కాంప్లెక్స్ తమిళనాడు ప్రభుత్వ శాసనసభ , సచివాలయంగా పనిచేస్తోంది. సీఎం విజయ్ ఆధ్వర్యంలో రానున్న కొత్త సెక్రటేరియట్ అంచనా వ్యయం రూ. 1,200 కోట్లుగా భావిస్తున్నారు. 20 లక్షల చదరపు అడుగులవిస్తీర్ణంలో ఇది రూపుదిద్దుకోనుంది. కొత్త కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం పట్టణపాక్కం, నందంబాక్కం, కోయంబేడు మరియు గిండిలోని హైవేస్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ ప్రాంగణాలను ఎంపిక చేసింది. గతంలో మాజీ ముఖ్యమంత్రులు జయలలిత, ఎం. కరుణానిధి కూడా అసెంబ్లీ, సచివాలయాలను వేరే చోటికి మార్చాలని ప్రతిపాదించినప్పటికీ, దశాబ్దాలుగా ఫోర్ట్ సెయింట్ జార్జ్ ప్రాంగణమే పాలనా కేంద్రంగా కొనసాగుతోంది.తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు, హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు.అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్టు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం' అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది.అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

# శాంతినికేతన్ లో కృష్ణాష్టమి



సంగారెడ్డి ప్రతినిధి నేడు సదాశివపేట పట్టణం నందు శాంతినికేతన్ విద్యాలయంలో మానవాళికి మార్గదర్శకుడైన ఆ నందగోపాలకృష్ణుని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ




కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రభు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పుష్కరించుకొని పాఠశాల చిన్నారులు రాధాగోపిక శ్రీకృష్ణా వేషధారణతో పాఠశాల మధురానగరం లా కనిపించింది. మనిషి మనిషిగా బతకమని మంచి సందేశాన్ని ఇచ్చి మానవాళిని సన్మార్గంలో నడిపించినటువంటి మహోన్నతమైనటువంటి జ్ఞానాన్ని భగవద్గీత ద్వారా సమాజానికి అందించినటువంటి శ్రీ కృష్ణ భగవానుడి జన్మదినాన్ని శ్రీ కృష్ణాష్టమిగా పాఠశాలల్లో జరుపుకోవడం చాలా హర్షించదగ్గ విషయం .జాతీయ నాయకులతో పాటు ధర్మ పరిరక్షణ కృషి చేసిన ఇలాంటి పండగలు పాఠశాలలో నిర్వహించుకోవడం విద్యార్థులకు మంచి సందేశాన్ని అందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈరోజు ప్రత్యేకంగా అలంకరించుకొని రావడానికి విద్యార్థులకు పాఠశాల తరపున ప్రత్యేక అభినందించడం జరిగింది చూడముచ్చటగా అలంకరించిన తల్లిదండ్రులకు పాఠశాల హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అరవింద శ్రీ మరియు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుప్రియ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# శ్రీసరస్వతి శిశు మందిర్ సదాశివపేట శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



, సంగారెడ్డి ప్రతినిధిశ్రీ సరస్వతీ శిశు మందిర్ సదాశివపేట్ పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి శ్రీ పిల్లోడి విశ్వనాథ్ గారు దీప ప్రజ్వలన చేసి కృష్ణాష్టమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్ని విద్యార్థులు కృష్ణుల,



గోపికల ,వేషధారణలో అభినయ గేయాలు. యోగ్ చాప్, కోలాటం, చెక్కభజనలు చేశారు. చిన్ని కృష్ణులు గోపికలు ఆటపాటలతో ఉట్టిలు కొట్టారు. ఈ సందర్భంగా ప్రధాన ఆచార్యులు సంగమేశ్వర్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు. శ్రీకృష్ణుని జననమే అర్ధరాత్రి జరిగింది, మరి చీకటి నుండి వెలుగు నింపడానికి శ్రీకృష్ణుడు జన్మించి అధర్మాన్ని, రాక్షసత్వాన్ని నిర్మూలించి ధర్మాన్ని ,మంచి మానవ లక్షణాన్ని ఉద్భవింప చేశాడని భావిస్తారు. కాబట్టి శ్రీకృష్ణుని జననం మనకు గొప్ప సందేశాన్ని గుర్తుచేస్తుంది. ఆదర్శం కలిగిస్తుంది అధర్మం పెరిగినప్పుడు ధర్మం ఉద్భవించి జయిస్తుంది. కష్టాల్లో ఉన్నప్పుడు ధైర్యాన్ని నింపడం కృష్ణతత్వం అంటారు. అన్యాయం ఎంత బలంగా ఉన్నా చివరికి న్యాయమే విజయం సాధిస్తుంది. అందుకు శ్రీకృష్ణ భగవానుని యొక్క ఆశీర్వాదం అవసరం, ప్రశాంతతను ఇచ్చేవాడే శ్రీకృష్ణ భగవానుడు, కావున శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున మనలోని చీకటిని తొలగించి వెలుగును ఆత్మస్థైర్యాన్ని సాధించాలి. అందుకే మనం శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున మన పిల్లలను శ్రీకృష్ణుడు రాధా వేషధారణలో చూస్తూ మందిరానికి వెళ్లి శ్రీకృష్ణ నామ భజన చేస్తూ ఆ కృష్ణ భగవాన్ యొక్క సన్నిధిలో గడపడం అనేది మన జీవితాన్ని దన్యమయం చేసి ఆనందాన్ని శక్తిని ధనాన్ని ప్రశాంతతను ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. కావున ప్రతి కుటుంబం దేవాలయానికి వెళ్లి ఆయన యొక్క ఆశీర్వాదం తీసుకొని మన సంస్కృతి సాంప్రదాయాల్లో ఉష్ణ భగవాన్ యొక్క జన్మదిన జరుపుకోవడం చాలా గొప్ప విషయంగా భావించాలి అందుకు ఈ సందర్భంగా మీ అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు అశోక్ , పాఠశాల కార్యదర్శి శ్రీ తంగడపల్లి లక్ష్మణ్ ,పాఠశాల ఉపాధ్యక్షులు శ్రీ సరాప్ శ్రీనివాస్ , పాఠశాల కోశాధికారి శ్రీ శరత్ చంద్ర , విద్యార్థులు, పోషకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మండలంలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## ప్రత్యేక ఆకర్షణగా లబానా లంబాడీల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



గాంధారిగాంధారి మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు మండలంలోని వివిధ గ్రామాల్లో ముఖ్యంగా లబానాలంబాడీలు ఉన్నతాండాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు కుటుంబంలో చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల



వరకు అందరూ ఒక్క పొద్దులు ఉండి శ్రేష్టమైన నల్లమట్టితో శ్రీకృష్ణ ప్రతిమలాను తయారుచేసి ప్రత్యేక పూజలు ప్రత్యేక నిర్వహిస్తారు నైవేద్యాలు నేయితో చేసిన మాల్ పూరీలు కృష్ణ భగవానునికి సమర్పిస్తారు ఈరోజు అంతా భజనలతో ప్రార్థనలతో గడుపుతారు తిప్పారం తాండలోశ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని పూజా నిర్వహించి తదనంతరం లబాన ఐక్యత జెండాను ఆవిష్కరించరు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కాయితి తండాలో ఆడపడుచులు అందరూ కలిసి చెరువు కట్ట కి వెళ్లి నల్ల మట్టిని తీసుకొచ్చి కృష్ణుని విగ్రహం తయారుచేసి పూజలు నిర్వహించారుశ్రీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో మహిళలు, యువతి యువకులు ఆటపాటలతో శ్రీకృష్ణుని బోధనలు, భగవద్గీత సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, సమాజంలో ప్రేమ, సోదరభావం, ధర్మం, ఐక్యత పెంపొందించాలని ఆకాంక్షించారు. మండలంలోని గుర్జాల్, నేరల్, చద్మల్, తిప్పారం, సంగం, కయితీ తాండ, మాధవ్ పల్లి, గుడిమెట్, పొతంగల్, సంగం మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ తండాలలో తాండాలలో శ్రీకృష్ణషమిజన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు'

## మండలంలోని బూర్గుల్, కరకట? వాడి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు ఏర్పాటు



గాంధారిపద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గాంధారి మండల అధ్యక్షుడు సంఘం రాజు ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మార్పీఎఫ్ మండల అధ్యక్షుడు సంఘం రాజు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వచ్చిన రిజర్వేషన్లు కాపాడుకుంటూ మన జాతి కోసం నిరంతరం పాటుపడాలని ఏ సమస్య వచ్చినా ముందర ఉండి సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేయాలని గ్రామాల్లోని తన జాతి ప్రజలకు దిశానిర్దేశం చేశారు బూర్గుల్ గ్రామ అధ్యక్షుడిగా మాధవపల్లి సంజువ్ ,అధికార ప్రతినిధిగా సాయిలు, కరక్ వాడి గ్రామ అధ్యక్షులుగా సిహెచ్ సాయిలు, అధికార ప్రతినిధిగా పైతర సంతోషులు గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో సర్పంచులు బంగారు శంకర్, గాలి మోహన్ , మండల కార్యదర్శి చిమ్మని సాయిలు, పి సాయికుమార్ ,ముత్తన్న, సాయిలు ,లక్ష్మణ్, సాయి ప్రసాద్ ,శంభాని శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ మహోత్సవం పాల్గొన్న పైడి ఎల్లారెడ్డి

**అన్ని మతాలను సమానంగా చూసిన మహనీయుడు చత్రపతి శివాజీ.. పైడి ఎల్లారెడ్డి**

గాంధారిమండలంలోని చద్మల్ తాండలో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ భవ్య



విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగింది చత్రపతి శివాజీ విగ్రహాన్ని విగ్రహ దాత ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా తాండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపకుడు, వీరత్వానికి, ధైర్యానికి మరియు ధర్మ పరిరక్షణకు ప్రతీక అయిన శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ భవ్య విగ్రహావిష్కరణ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూస్వరాజ్య స్థాపన విదేశీ సామ్రాజ్యవాద పాలనల మధ్య స్వయంపాలనకు ప్రాధాన్యతనిస్తూ హిందవీ స్వరాజ్య భావననుముందుకు



తీసుకెళ్లారు. అద్భుతమైన సైనిక వ్యూహాలుకొండలు, కోటలు, భౌగోళికపరిస్థితులనుసమర్థంగాఉపయోగించుకుని గెరిల్లా యుద్ధ పద్ధతిని అభివృద్ధి చేశారు. రాయగఢ్, ప్రతాప్‌గఢ్ వంటి కోటలను వ్యూహాత్మకంగా ఉపయోగించి తన రాజ్యాన్ని బలోపేతం చేశారని ప్రజా సంక్షేమ పరిపాలనరైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పన్నుల వ్యవస్థ, పరిపాలనలో అనేక మార్పులు చేశారనీయుద్ధ సమయంలో మహిళల పట్ల గౌరవంగా వ్యవహ రించాలని సైన్యానికి కఠినమైన నియమాలు విధించినట్లు చారిత్రక వర్ణనలు చెబుతున్నాయి. ఆయన పాలనలో ఇతర మతాల ప్రజల పట్ల కూడా గౌరవం చూపిన ఉదాహరణలు చరిత్రలో కనిపిస్తాయి. అందువల్ల ఆయనను కేవలం ఒక మతానికి పరిమితమైన నాయకుడిగా కాకుండా సమర్థుడైన రాజ్యనిర్మాతగా చూడటం సముచితం ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు , బీజేపీ జిల్లా అధ్యక్షుడు పెద్దలు నీలం చిన్న రాజులు, మండల అధ్యక్షులు మధుసూదన్, జిల్లా నాయకులు పోతంగల్ కిషన్ రావు, సాయి బాబా, శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మా సంస్కృతి సాంప్రదాయాలు మా ఆలయాలు మా గురువులు వద్దు కానీ మా రిజర్వేషన్లు కావాలనా.. లొంక తండా మాజీ సర్పంచ్ ప్రేమ్ సింగ్



గాంధారి గాంధారి మండలంలోని కొందరు లాబాన నాయకులు కుట్రలు పన్ని నేరల్ తండాలో జగదాంబ మాత సేవలాల్ ఆలయాన్ని నిర్మించకుండా అడ్డుపడుతు న్నారని ఆలయానికి రావలసిన నిధులు రాకుండా చేస్తున్నారని లొంక తండా మాజీ సర్పంచ్ ప్రేమ్ సింగ్ ఆరోపించారు మాసంస్కృతి సాంప్రదాయాలు మా ఆలయాలు మా గురువులను గౌరవించడం రాదు కానీ మా ఎస్టి రిజర్వేషన్లు కావాలని పోరాటం చేస్తున్నారు మా ఆలయానికి విరాళాలు ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్న మీరు మా రిజర్వేషన్లు మీకెందుకు మా రిజర్వేషన్ కోసం మీరెందుకు పోవడం చేస్తున్నారు మీరు ఏమైనా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారా లబానా సమాజానికి చెందిన కొందరు నాయకులు కుట్రలు పన్ని ఆలయాలు నిర్మించకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు మా ఆలయాల జోలికి వస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు

## జగద్గురు నీలకంఠ మహాస్వామి చతుర్ధ వార్షిక పుణ్యా స్మరణోత్సవం



సంగారెడ్డి ప్రతినిధి సదాశివపేట పట్టణంలోని పెద్ద మఠం పీఠాధిపతులు నిరంజన ప్రణవ స్వరూపులు జగద్గురువులు నీలకంఠ మహాస్వామి వారి చతుర్ధ వార్షిక పుణ్య స్మరణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయము ఎనిమిది గంటలకు స్థానిక పెద్దమటము నుండి శివనామస్మరణతో మహేశ్వరి టాకీస్ వద్ద ఉన్నటువంటి గురువుగారి గదిగే వరకు చేరుకొని గురు ప్రార్ధన మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు పెద్ద మఠం నిర్వాహకులు లింగానంద్ స్వామి అన్నారు. ధార్మిక కార్యక్రమంలో ష.బ్ర.108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి, డాక్టర్ రంజోలు రాచయ్య స్వామి ధార్మిక సందేశాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం చౌకీమఠం అధ్యక్షులు చీల మల్లన్న ఎడ్ల బజార్ అధ్యక్షులు గండిగ రాజు, ప్రధాన కార్యదర్శి పిల్లోడు విశ్వనాథం మరియు సంగారెడ్డి మాజీ అధ్యక్షులు మధుశేఖర్, సమాజ సభ్యులు మరియు అర్చక బృందం భక్తాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని నీలకంఠ మహాస్వామి వారి పాదపద్మములకు నమస్కరించి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా



సంగారెడ్డి ప్రతినిధి సదాశివపేటలోని కృష్ణ మందిరంలో శుక్రవారం ఉదయం మంగళ స్నానాలు అనంతరం మధ్యాహ్నం మంగళహారతి శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఓదెల కవిత గుప్తా, ఓదెల శ్యాంసుందర్ గుప్తా, మల్లికార్జున రాజు, నాగేష్ భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్లు నాగుల మానెమ్మ , అనిత విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామస్తులు సదాశివపేటలోని ప్రజలు అత్యధికంగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందడం జరిగింది.

# 1000రోజుల పాలన ప్రతిరోజు పండగ



సంగారెడ్డి ప్రతినిధితెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం 1000 రోజుల పాలన సందర్భంగా ప్రజా పాలన గడప గడపకు సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబంలో వెలుగుల రూపం. మాట తప్పని మడమ తిప్పని నాయకత్వం ప్రజా ప్రభుత్వం ప్రజల నమ్మకం తెలంగాణ ప్రగతికి సరికొత్త గమ్యం సదాశివపేట



మండలంలో ఆరూర్ గ్రామం నుండి 400 వందల బైక్ ర్యాలీ ప్రారంభమై గ్రామాల మీదగా మెలిగిరి పేట్, సూరారం, తంగడపల్లి, మద్దికుంట, ఆత్మకూర్, పొట్టి పల్లి, కోల్కూర్, నిజాంపూర్, నంది కంది, మీదగా పెద్దాపూర్ గ్రామంలో ఈ కార్యక్రమానికి మన ముఖ్యఅతిథి డిసిసి అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ నిర్మల జగ్గారెడ్డి గారు పాల్గొన్నారు మండలంలోని జణజ చైర్మన్ గడీల రాంరెడ్డి గారు సదాశివపేట బ్లాక్ అధ్యక్షుడు సిద్దన్న గారు సేవాదళ్ అధ్యక్షులు సందీప్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ సర్పంచ్, సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, సర్పంచులు , సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మల్లికార్జున్,మధు, మగ్గదం, ఆశిరెడ్డి, మోహన్ గౌడ్, శంకరయ్య, షాబుద్దీన్, దుర్గాప్రసాద్, భారతమ్మ బాబు, అనిత శ్రీనివాస్, నికిత బిమ్బదర్ చారి, తులసి సత్యనారాయణ, మనీషాబాలరాజు గౌడ్, విజయలక్ష్మి శివానంద గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర మండల నాయకులు,మాజీ జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటాలజిస్ట్స్

**32వ వార్షిక జాతీయ సదస్సును హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం సాయంత్రం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు.**






సంగారెడ్డి ప్రతినిధిఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఓరల్ ఇంప్లాంటాలజీ ప్రస్తుతం ఆధునిక దంత వైద్యంలో కీలక భాగంగా మారిందని, కోల్పోయిన దంతాలను భర్తీ చేయడానికే పరిమితం కాకుండా రోగుల నమలే సామర్థ్యం, సౌందర్యం, ఆత్మవిశ్వాసం, జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఇంప్లాంట్ డెంటిస్ట్రీ ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ దంత వైద్య సేవలను విస్తరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 50 మంది డెంటల్ డాక్టర్లను నియమిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఓరల్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నివారణ, ముందస్తు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఓరల్ హెల్త్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు డెంటల్ డాక్టర్లు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ఇంటింటికి తెలుగుదేశం. ఎపి ఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు



రాజవొమ్మంగి, ఆగష్టు 31 మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ కిమ్మలగెడ్డ గ్రామంలో రెండేళ్ల నమ్మకం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన శుక్రవారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల కరపత్రాలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కోసం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను గ్రామస్తులకు వివారించారు ప్రజ సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెక్కా లోవరాజు, టి నూకరాజు, వి లోవరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోపిక వేషంలో ఆకట్టుకున్న బండారు జాన్విక.. కిడ్జీ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి!



అశ్వారావుపేట, అశ్వారావుపేట మండల కేంద్రంలోని కిడ్జీ (ఖఅఒఓవవ) ప్రి-స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో సందడి చేస్తూ అందరినీ విశేషంగా అలరించారు. ముఖ్యంగా బండారు శ్యామ్ – చందన దంపతుల కుమార్తె బండారు జాన్విక గోపిక వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరి ప్రశంసలు అందుకని ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రాంగణాన్ని ఉట్టి, రంగురంగుల పూలతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా శోభాయమానంగా అలంకరించారు. చిన్నారులు "గోవిందా.. గోవిందా.." అంటూ ఉత్సాహంగా చేసిన ఉట్టి కొట్టే ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పసిపాపల కేరింతలు, సాంస్కృతిక నృత్యాలు, భక్తి పాటల మైమరపులతో పాఠశాల అంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... "మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విలువలను చిన్నతనం నుంచే పిల్లలకు తెలియజేయాలనే విశిష్ట ఉద్దేశంతో ఈ వేడుకలను ప్రతియేటా నిర్వహించడం జరుగుతోంది. ఇటువంటి పండుగలు పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడతాయి" అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు.

## రేండ్లపల్లి సాయిబాబా మందిర 9వ వార్షికోత్సవం.

### ------- ఆలయ కమిటీ అధ్యక్షులు కోడూరు రాములు.



సంగారెడ్డి ప్రతినిధిసదాశివపేట మండలంలోని రేండ్లపల్లి గ్రామంలో సాయిబాబా మందిరంలో ఎనిమిదవ సంవత్సరం పూర్తి చేసుకొని 9వ సంవత్సరం వార్షికోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు కోడూరి రాములు తెలిపారు. కాబట్టి గ్రామ ప్రజలు ఇట్టి భక్తులు ప్రతి ఒక్కరూ రావలసిందిగా కోరుతున్నామని అన్నారు. ఉదయము 5 గంటలకు సుప్రభాత సేవ, పల్లకి సేవ తదుపరి శ్రీ సాయినాధునికి భక్తులందరిచే స్వామివారి అభిషేక కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నము 12 గంటలకు స్వామివారి మధ్యాహ్న హారతి అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుంది. కావున భక్తులందరూ కూడా స్వామివారి కృప కటాక్షలూ అందరు పొందాలని ఆలయ కమిటీ అధ్యక్షులు కోడూరి రాములు తెలిపారు.

## సంగారెడ్డిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి ప్రతినిది ,సంగారెడ్డి పట్టణంలో మురలీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా



నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో సందడిగా మారింది.కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి జీవిత సందేశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ధర్మం, సత్యం, మానవత్వం వంటి విలువలను ఆచరించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచించారు. ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగద్గురు నీలకంఠ మహాస్వామి వారి చతుర్ధ పుణ్యాస్మరణ ఉత్సవం

జగద్గురు నీలకంఠ మహాస్వామి చతుర్ధ వార్షిక పుణ్యా స్మరణోత్సవం



సంగారెడ్డి ప్రతినిధిసదాశివపేట పట్టణంలోని పెద్ద మఠం పీఠాధిపతులు నిరంజన ప్రణవ స్వరూపులు జగద్గురువులు నీలకంఠ మహాస్వామి వారి చతుర్ధ వార్షిక పుణ్య స్మరణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయము ఎనిమిది గంటలకు స్థానిక పెద్దమటము నుండి శివనామస్మరణతో మహేశ్వరి టాకీస్ వద్ద ఉన్నటువంటి గురువుగారి గదిగే వరకు చేరుకొని గురు ప్రార్ధన మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు పెద్ద మఠం నిర్వాహకులు లింగానంద్ స్వామి అన్నారు. ధార్మిక కార్యక్రమంలో ష.బ్ర.108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి, డాక్టర్ రంజోలు రాచయ్య స్వామి ధార్మిక సందేశాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఎడ్ల బజార్ అధ్యక్షులు గందిగె రాజు,వీరశైవ సమాజం చౌకీమఠం అధ్యక్షులు చీల మల్లన్న ప్రధాన కార్...

## బైక్ చోరీ కాదు.. పొరపాటున ఎక్ఛేంజ్ అయింది.



రాయదుర్గం సెప్టెంబర్ 4 బ్యాంక్ వద్ద బైక్ మాయమైన ఘటనపై క్లారిటీ ఇచ్చిన సీఐ దేవానంద్రాయదుర్గం పట్టణంలోని ఎస్బీఐ బ్యాంక్ వద్ద బైక్ చోరీకి గురైందంటూ వచ్చిన సమాచారంపై పోలీసులు క్లారిటీ ఇచ్చారు. బైక్ చోరీ కాలేదని, పొరపాటున మరో వ్యక్తి బైక్ను తీసుకెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకుందని సీఐ దేవానంద్ తెలిపారు.గోనబావికి చెందిన మంతేష్ అనే వ్యక్తి ఎస్బీఐ బ్యాంక్లో సుమారు రూ.లక్ష లావాదేవీ కోసం వచ్చారని సీఐ తెలిపారు. అనంతరం బ్యాంక్ బయట ఉన్న బైక్లలో పొరపాటున మున్సిపల్ అధికారిగా పనిచేస్తున్న నారాయణరెడ్డికి చెందిన బైక్ను తన బైక్గా భావించి తీసుకెళ్లినట్లు మంతేష్ తెలిపాడన్నారు.తర్వాత విషయం గుర్తించిన మంతేష్ సంబంధిత వివరాలను పోలీసులకు తెలియజేశారని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి చోరీ జరగలేదని, బైక్లు పొరపాటున ఎక్ఛేంజ్ అయ్యాయని సీఐ దేవానంద్ స్పష్టం చేశారు.ఈ ఘటనను బైక్ చోరీగా భావించవద్దని, ఇది పూర్తిగా పొరపాటున జరిగిన సంఘటన అని సీఐ దేవానంద్ తెలిపారు.

## రాజవొమ్మంగిలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



రాజవొమ్మంగి, సెప్టెంబర్ 4 మండల కేంద్రంలోని స్థానిక శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా శు క్రవారం కృష్ణాష్టమి వేడుకలు కొప్పు సూరిబాబు అధ్యక్షతన యాదవ్ సంఘం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు వేకువజామున నుంచి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు శివాలయం పురోహితులు శ్రీనివాస్ శర్మ చే స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు కమిటీ సభ్యులు స్వామివారి దర్శనార్థం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు దాతల సహాయ సహకారాలతో ఆలయం ఆవరణలో ఉదయం 11 నుండి రెండు వేల మందికి భారీ



అన్నసమారాధన నిర్వహించారు సాయంత్రం ఉట్టుకొట్టే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో కీర్తనలు భజనలు చేశారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, యువకులు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల అధ్యక్షుడు పోరాళ్ళు ధనార్జునా ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు.



రాయదుర్గం సెప్టెంబర్ 4 రాయదుర్గం పట్టణంలో కృష్ణ అష్టమి వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మరియుబ ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి పూజారి శివ ప్రసాద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఒకప్పుడు మధురలో కంసుడు అనే క్రూరమైన రాజు ఉండేవాడు అని దేవకి వసుదేవులకు పుట్టే ఎనిమిదవ బిడ్డ వల్ల కంసుడికి ప్రమాదం ఉన్నదని ఆకాశవాణి చెప్పింది శ్రీకృష్ణుడు జన్మాష్టమి రోజున అర్ధరాత్రి దేవకి వసుదేవులకు జన్మించడం జరిగింది వసుదేవుడు కృష్ణుడిని గోకులానికి తీసుకువెళ్లి యశోద నందుల వద్ద



ఉంచాడు అని గోకులంలో కృష్ణుడు అందరిని తన చిలిపి చేష్టలతో ఆనందపరిచాడని వెన్నదొంగలిస్తూ స్నేహితులతో ఆడుకుంటూ అందరి ప్రేమను పొందాడు కృష్ణుడు చెడుపై మంచి గెలుస్తుందని ధర్మాన్ని కాపాడాలని మనకు బోధించాడు అందుకే మనము శ్రీకృష్ణ జన్మాష్టమి భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నామని ఎల్లప్పుడూ ధర్మం నిజం మరియు మంచిని మనమందరము ఆచరించాలని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడమైనది ఇందులో భాగంగా విద్యా మందిరంలో గోకులం గా మాది ఉట్టి కొట్టడంతో పాటు పిల్లలు నృత్య ప్రదర్శనలు చేస్తూ కోలాటాలు చేస్తూ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం జరిగింది మరియు పాఠశాల యందు మినీ వాటర్ ప్లాంట్ ను సెంట్రల్ అధ్యక్షుడు పూజారి శివప్రసాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మహబూబ్ బాషా గారు అధ్యక్షులు పోరాళ్ల ధనార్జన గారు ప్రారంభించి నీరు అందించడం జరిగింది ఈ కార్యక్రమమునందు పాఠశాల ప్రధానాచార్యులు రాజేశ్వరి చంద్రకళ ఆచార్యులు మహాదేవి వందన అనసూయ విశాల సంగీత శిల్ప చందన తదితర ఆచార్య బృందం పాల్గొన్నారు

## నేటి తరానికి ఆదర్శప్రాయుడు కామ్రేడ్ కర్రె రామస్వామి

కర్రె బిక్షపతి నేదునూరి రాజమౌళి



హసన్ పర్తి మండలం సెప్టెంబర్ 4సమాజంలో అసమానతలు దోపిడీ వివక్షత అవినీతి లంచగొండితనం నిర్మూలించబడి దోపిడీ పీడన లేని సమ సమాజం ఏర్పడాలని కొనసాగుతున్న కమ్యూనిస్టు విప్లవోద్యమంలో కామ్రేడ్ కర్రే రామస్వామి చురుకైన క్రియాశీల కార్యకర్తగా నాయకునిగా తన జీవితకాలం కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగడం నేటి తరానికి ఆదర్శప్రాయమని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ తెలిపారు శు క్రవారం రోజున ఎల్కతుర్తి మండలం ఇంద్రానగర్ కర్రె రామస్వామి భౌతిక దేహం పై ఎర్ర కండువా కప్పి జోహార్లు అర్పించి మాట్లాడుతూ కర్రే రామస్వామి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం సంతాప సందేశం చేస్తూ భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుంటూ కార్మిక వర్గ శ్రేయో రాజ్యం కొరకు క్రియాశీల పోరాటాలలో పాల్గొనడమే కర్రే రామస్వామి కి మనం ఇచ్చే ఘనమైన నివాళులు అని తెలిపారు దళిత కుటుంబంలో జన్మించిన పేదరికము వెంటాడిన ఇటు కుటుంబాన్ని అటు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ధైర్యశాలి అన్నారు తోటి వారికి ఆపద వస్తే ఆదుకునే వాడని ప్రజలతో కలిమిడిగా మెదులుతూ అనేక సమస్యలకు పరిష్కారకుడుగా నిలిచాడని పార్టీ నిర్వహించిన ప్రతి పోరాట కార్యక్రమంలో ముందు వరుసలో ఉండి బాధ్యతాయుతంగా నిజాయితీ తన వంతు బాధ్యతను నిర్వర్తించిన గొప్ప నిగర్వి అని కొనియాడినారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబాల రాజు సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు కర్రే లక్ష్మణ్ శనిగరపు రాజ్ కుమార్ సమితి సభ్యులు మర్రి శ్రీనివాస్ నాంపల్లి లక్ష్మయ్య రామస్వామి భార్య కాంతా లక్ష్మి కూతురు గడ్డం లలిత కుమారుడు కర్రె రాజేందర్ కోడలు మనుమలు మనుమరాలు బంధుమిత్రులు ఇంద్రానగర్ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణుని కళ్యాణం



నందలూరు, సెప్టెంబర్ 4 మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధి అరవపల్లిలోని శ్రీకృష్ణ గీతా మందిరం ఆవరణంలో శ్రీకృష్ణ పాద సేవకులు కుర్రామణి యాదవ్, గొల్లపల్లి లోని సీతారాముల ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణం శు క్రవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. శ్రావణ బహుళ సప్తమి, తదియ సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండిపోయాయి. కల్యాణ మహోత్సవానికి భారతాల శ్రీధర్బాబు యాదవ్, సుప్రియ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వ్యాఖ్యాతగా సొట్టు అమర్నాథ్ శర్మ వ్యవహరించారు. గొల్లపల్లి గ్రామంలో జరిగిన శ్రీకృష్ణ కల్యాణోత్సవ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వైభవంగా పుష్పయాగం

సీతారాముల కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో పుష్పయాగం కార్యక్రమాన్ని



భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి వారికి పుష్పార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం పూల పరిమళంతో, భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది.

### రూ.1.75 లక్షలు పలికిన లడ్డు

మండలంలోని అరవపల్లి శ్రీకృష్ణ గీతా మందిరంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణుడి కళ్యాణ మహోత్సవంలో లడ్డు వేలం పాట ఉత్సాహంగా సాగింది. ఈ వేలం పాటలో వై.కోటకు చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం--కువైట్ ప్రతినిధులు రూ.1,75,000లకు లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొనగా, లడ్డు రూ.1.75 లక్షలకు పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### వైభవంగా గ్రామోత్సవం

శ్రీకృష్ణ గీతా మందిరం నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణ, ఉగ్ర నరసింహ, శ్రీ వెంకటేశ్వర స్వామి వేషదారులు, కోలాటాల నడుమ భక్తుల సందడి మధ్య ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కాయా కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నందలూరు వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కళ్యాణ మహోత్సవానికి రాజంపేట జనసేన పార్టీ పార్లమెంటు సమన్వయకర్త అధికారి కృష్ణ, టిడిపి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత రమణ, మేడా విజయ శేఖర్ రెడ్డి, తదితర నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు

హరీశ్ రావు, కేటీఆర్ సభలో అడుగుపెడితే

మంత్రులకు ముచ్చెమటలు

వృద్ధులు, మహిళలు, వికలాంగులకు

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం

విఫలం: మీూ చింత ప్రభాకర్



సంగారెడ్డి ప్రతినిధిసంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన ధర్నాఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ హామీల అమలులో "మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడప దాటడం లేదు" అన్న చందంగా వ్యవహరిస్తోందని మీూ చింత ప్రభాకర్ విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన ధర్నా నిర్వహించింది.

### కేసీఆర్ వస్తే రేవంత్కు తట్టుకోలేరు..

అసెంబ్లీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగుపెడితే ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ చింత ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే హరీశ్రావు, కేటీఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే ముఖ్యమంత్రి, మంత్రులు "నోట్లో నాలుక లేనట్టుగా.. సమాధానం కోసం తడబడుతున్నారని" ఎద్దేవా చేశారు."చెప్పేది శ్రీరంగనీతులు.. చేసేది తలకిందుల పనులు" అన్నట్టుగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

### వృద్ధులకు రూ.4,000 పింఛన్ హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వృద్ధులను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు.

"మాట ఇచ్చి మడమ తిప్పడం ప్రజలకు ఆమోదయోగ్యం కాదు.." అని పేర్కొంటూ, వృద్ధులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### మహిళలకు రూ.2,500 ఎక్కడ?

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు.మహిళలకు నెలనెలా రూ.2,500 అందిస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు."ఆడబిడ్డల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. ఆడబిడ్డలకే ఇచ్చిన మాటను మరిచిపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని హెచ్చరించారు.

### వికలాంగులకు రూ.6,000 పింఛన్ హామీ ఏమైంది?

వికలాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేయకుండా వికలాంగులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటా?"ఎద్దు పోయిన తర్వాత గోతులు తవ్వినట్టుగా.. అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెట్టడం సరికాదు" అని విమర్శించారు.వృద్ధులు, మహిళలు, వికలాంగులు కాంగ్రెస్పై నమ్మకంతో ఓటు వేశారని, ఇప్పుడు అదే ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

### "హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు"

వృద్ధులకు రూ.4,000 పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వికలాంగులకు రూ.6,000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## అమీన్పూర్‌లో ఘనంగా కాంగ్రెస్ ర్యాలీ..

# 1000 రోజుల పాలనపై ప్రచారం



)4సెప్టెంబర్‌ప్రజా ప్రభుత్వానికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అమీన్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పటాన్చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు, అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.మన్నె రవీందర్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, కేఎస్‌జీ యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు, యువత కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అమీన్పూర్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

# సంగారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ నాయకుల భారీ బైక్ ర్యాలీ





4సెప్టెంబర్‌కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తిచేసుకున్న సదర్భంగా కంది, కొండాపూర్, సంగారెడ్డి పట్టణం లో జెండా ఊపి బైక్ ర్యాలీ లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డిమ్యానిఫెస్టో లో లేని సంక్షేమ పథకాలు సైతం అమలుచేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వంపార్టీలకతీతంగా పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయిడిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డికాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 1000 రోజులు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కంది, కొండాపూర్ మండల కేంద్రాల్లో, సంగారెడ్డి పట్టణం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.సంగారెడ్డి పట్టణం లో రామ్ మందిర్ నుండి ప్రారంభమైన ర్యాలీ భవానీ మందిర్, నల్సాబ్ గడ్డ, రుక్మిణి థియేటర్, శాంతి నగర్ ల మీదుగా రాజంపేట, ఇందిరా నగర్, తార డిగ్రీ కాలేజ్, బైపాస్ రోడ్డు మీదుగా ఐబీ నెహ్రూ జంక్షన్ దాకా కొనసాగింది. ర్యాలీ పూర్తయిన అనంతరం ఐబీ జంక్షన్ వద్ద మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్ గాంధీ ల విగ్రహాలకు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టిందని అంతేకాకుండా కోటికి పైగా రేషన్ కార్డులు అందించదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలం లో మహిళ సంఖేమమే ధ్యేయంగా మహిళ కోసం ఉచిత బస్సు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. గత ప్రభుత్వం లో డబుల్ బెడ్ రూమ్ పథకం నామ్ కే వాస్తే గా సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఆనందం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మెన్ ప్రభు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, జార్జ్,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్,నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహేష్,కంది సర్పంచ్ శ్రీరామ్, రమేష్, భూమేష్, ఫయాజ్, అన్వర్, సురేష్, కిరణ్, వంశీ,రవీందర్ నాయక్, శ్రీశైలం, ప్రశాంత్, రాజు గౌడ్, హరీష్, తాహెర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుతిక హల్దీ వేడుకకు మంత్రి సీతక్క హాజరు



మల్లంపల్లి, సెప్టెంబర్ 4 మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ల్యాద రజిని లక్ష్మణరావు కుమార్తె రుతిక హల్దీ వేడుకకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై వధువును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రుతికను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు జిల్లా కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ములుగు జిల్లా మెడికల్ హెల్త్ వింగ్ చైర్మన్ ఆనందపు రవిబాబు, సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాగితోజు దేవేంద్రచారి, మల్లంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు పొనుగంటి రవీందర్, ఉపాధ్యక్షుడు అయితే బద్రి, ఉపసర్పంచ్ అంకం సురేష్, కాంగ్రెస్ నాయకులు మూల గణేష్‌రెడ్డి, కక్కర్ల సాంబయ్య, చంద రాము, గొర్రె కుమార్‌స్వామి, ఎడ్ల అనిల్‌రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, వార్డు సభ్యులు చిన్నబోయిన మహేందర్, గొల్లెనా సారంగపాణి, జింక వేణు, దయ్యాల చంద్రమౌళి, కొంగరి నరేందర్, పంజాల సురేష్, కూచన సురేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా, నియోజకవర్గ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు





మల్లంపల్లి, సెప్టెంబర్04( మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మల్లంపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల లీడర్

# కొర్వి కృష్ణ స్వామి : నీలం మధు ముదిరాజ్



4 సెప్టెంబర్‌ఆ వీరుడు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు,పాత్రికేయుడు,రచయిత, విద్యావేత్త బహుముఖ ప్రజ్ఞాశీలి..ఆ మహనీయుడి కృషితోనే హైదరాబాద్ మాస్టర్ ప్లాన్..ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం..కలిసికట్టుగా ముందుకు కదిలి బలపడదాం: నీలం మధు ముదిరాజ్..చిట్కుల్ లో



ఘనంగా కృష్ణస్వామి జయంతి వేడుకలు..శుక్రవారం కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన నీలం మధు.హైదరాబాద్ నగర మేయర్ గా పని చేసి ఆయన ముందుచూపుతో చేసిన నగర మాస్టర్ ప్లాన్ చిరస్థాయిగా నిలిచిపోయింది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల ముద్దుబిడ్డ మహానేత కొర్వి కృష్ణస్వామి అని, ఆయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, పాత్రికేయడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశీలి అని ఆయన బహుజనుల పక్షాన ఉండి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. ఆ మహానేత ఆశయాలను ఆయన స్ఫూర్తితో మనమంతా కలిసి ముందుకు తీసుకెళ్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 04 జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాంభద్రునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆలయాలు మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. దేవాలయ నిర్మాణానికి తన వంతుగా అవసరమైన సహాయాన్ని అందిస్తానని మంత్రి తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములైతే "ఇది మన గుడి" అనే భావన ప్రతి ఒక్కరిలో కలుగుతుందని అన్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు.శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులను మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన... సర్పంచ్ ఉప సర్పంచ్ లు

ఏజెన్సీలో మెరుగైన నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడు.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం సెప్టెంబర్ 04 ప్రతినిధి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. మణుగూరు ప్రభుత్వ ఏరియా వంద పడకల దావకానాను ఆకస్మికంగా తనిఖీ చేసిన.. సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ ఈ సందర్భంగా ఆసుపత్రిలోగల వార్డులలో విస్తృతంగా పర్యటించి రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఫార్మర్ సి లోని మందులను పరిశీలించడమైంది. అలాగే ఆస్పత్రి ముందు భాగంలో సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మాణం అవుతున్న ఓపీ బ్లాకు పనులను పరిశీలించడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రజా ఆరోగ్యంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో పాటు ఏజెన్సీలో మెరుగైన నాణ్యమైన ఒ అధునాతన వైద్యం అందించడమే లక్ష్యంగా వారు కృషి చేస్తున్నారరన్నారు. వారి చొరవతో లక్షల రూపాయల నిధులతో దవఖానాలో అధునాతన పరికరాలను సమకూర్చుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోనే రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్న డాక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా దావకాన సూపర్డెంట్ ముదిగొండ రామకృష్ణ, డాక్టర్ నిఖిల్, నర్స్ సూపర్డెంట్, మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు...

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**భజన చేస్తూ ఊరేగింపు, ఉట్టి కొట్టే కార్యక్రమం లో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు**



జనం, సంగారెడ్డి ప్రతినిధి సంగారెడ్డి పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద గల రామ్ నగర్ రామ్ మందిర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని రామ్ మందిర్ పరిసర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా భజన చేస్తూ భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ మందిర్ ఆవరణలోని శ్రీకృష్ణుడి ఆలయంలో విగ్రహాన్ని ఊయలలో ఉంచి నిర్వహించిన డోలారోహణం కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొని



ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం రామ్ మందిర్ పురవీధుల్లో భజనలు, కోలాటాలతో 12 ఉట్టి కుండలతో ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సందడి నడుమ సాగిన ఈ ఊరేగింపు అనంతరం రామ్ మందిర్ కమాన్ వద్ద సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా ఉట్టి కొట్టి భక్తులను ఉత్సాప ాపరిచారు.ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గీతాలు, భజనలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో రామ్ మందిర్ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# లింకేజీ రుణాల మంజూరులో 'చేతివాటం' ఆరోపణలు!

# ఈ బయ్యారం బ్యాంకు మిత్రపై గ్రూపు సభ్యుల ఆగ్రహం

' లంచం ఇస్తేనే పని జరుగుతోంది' అంటూ లబ్ధిదారుల ఆరోపణలు.. విచారణకు డిమాండ్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం సెప్టెంబర్ 04 ప్రతినిధిపినపాక మండలం ఈఈ బయ్యారం బ్యాంక్‌లో లింకేజీ రుణాల మంజూరు ప్రక్రియపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకులో పనిచేస్తున్న బ్యాంకు మిత్ర రుణాల మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలువురు స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులు, లింకేజీ రుణాల లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు..రుణాల కోసం బ్యాంకును ఆశ్రయిస్తున్న గ్రూపు సభ్యుల నుంచి అనవసరమైన జాప్యం చేస్తున్నారని, కొందరి పనులు మాత్రం త్వరగా పూర్తవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా లంచం ఇవ్వనిదే రుణాలకు సంబంధించిన పనులు ముందుకు సాగడం లేదని పలువురు లబ్ధిదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రుణం కోసం అవసరమైన ప్రక్రియ పూర్తి చేసుకున్నప్పటికీ తమను బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారని కొందరు గ్రూపు సభ్యులు వాపోతున్నారు. పేద, మధ్యతరగతి మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న లింకేజీ రుణాలు కొందరి వ్యవహార శైలితో ఇబ్బందులకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, బ్యాంకు మిత్రకు వెలుగు ఏపీఎం అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా గ్రూపు సభ్యుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. లింకేజీ రుణాల మంజూరులో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ చేపట్టాలని గ్రూపు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. రుణాల మంజూరులో చేతివాటం, లంచాల వ్యవహారం నిజమేనా? ఎవరి ప్రమేయం ఉంది? లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. అధికారులు బ్యాంకు రికార్డులు, రుణ దరఖాస్తులు, మంజూరు వివరాలు, లబ్ధిదారుల వాంగ్మూలాలను పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రూపు సభ్యులు పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరాధార ఆరోపణలైతే వాటిని కూడా స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. పేద మహిళా సంఘాలకు అందాల్సిన రుణాల విషయంలో అక్రమాలకు, లంచాలకు ఆస్కారం లేకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆరోగ్యం, ఆదాయం.. భారత అవకాడోలకు పెరుగుతున్న ఆదరణ.. రైతులకు సిరులు!

భారత అవకాడోలకు ఆదరణ పెరుగుతోందన్న ప్రధాని మోదీ

రైతుల ఆదాయం పెంచడంలో ఈ పండు పాత్రపై ప్రశంస

మన్ కీ బాత్ కార్యక్రమంలో ఏపీ రైతు విజయగాథ ప్రస్తావన

ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు ఈ పండులో పుష్కలం

పట్టణాల డిమాండ్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం



భారత్‌లో పండిస్తున్న అవకాడో పండ్లకు మార్కెట్లో ఆదరణ బాగా పెరుగుతోందని, ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పోషక విలువలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్న ఈ పండు ప్రాముఖ్యతను ఆయన తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆగస్టు 30న ప్రసారమైన తన 137వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో, ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ప్రధాని ఈ విషయాలను ప్రస్తావించారు. ఒకప్పుడు భారతదేశంలో పెద్దగా పరిచయం లేని, తక్కువ డిమాండ్ ఉన్న ఈ పండు, ఇప్పుడు ఆరోగ్య స్పృహ ఉన్నవారి డైనింగ్ టేబుళ్లపై, ప్రీమియం మార్కెట్లలో సాధారణంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. అవకాడోలు రోజువారీ ఆహారానికి కొత్త రుచిని జోడించడంతో పాటు, రైతుల ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని పలువురు రైతుల విజయగాథలను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన రైతు వరదరాజ్, చాలాకాలంగా టమాటా, అరటి పండించేవారు. తన స్నేహితుడి పొలంలో అవకాడో చెట్లను చూసి, ఆన్‌లైన్‌లో దాని గురించి పరిశోధన చేసి ఈ సాగును ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన ఏటా నాలుగు టన్నుల దిగుబడి సాధిస్తూ స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా, తమిళనాడులోని కొడైకెనాల్‌కు చెందిన చంద్రశేఖరన్, అర హెక్టారులో అవకాడోలను పండించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. కర్ణాటకలోని చిక్కమగళూరు రైతులు కాఫీ, మిరియాల తోటలలో అంతరపంటగా అవకాడోలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో అవకాడో సాగు ప్రధానంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంది. ఉష్ణమండల, ఉప ఉష్ణమండల వాతావరణం దీనికి అనుకూలంగా ఉంటుంది. అయితే, మంచును ఈ పంట తట్టుకోలేదు.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

పోషకాహార నిపుణుల ప్రకారం అవకాడోలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ (ఆలివ్ నూనెలో ఉండేవి), ఫైబర్, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియం, విటమిన్ కె, ఇ వంటివి ఇందులో పుష్కలంగా ఉంటాయి. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు సగం నుంచి ఒక మధ్యస్థ అవకాడోను మించకుండా పచ్చిగానే తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంమీద ఒకప్పుడు దిగుమతి చేసుకునే ప్రత్యేక పండుగా ఉన్న అవకాడో, ఇప్పుడు దేశీయంగా పండుతూ పట్టణాల డిమాండ్‌ను అందుకోవడమే కాకుండా, గ్రామీణ రైతుల ఆదాయాన్ని పెంచుతోందన్న ప్రధాని వ్యాఖ్యలు ఈ మార్పును స్పష్టం చేస్తున్నాయి.

# ఉదయాన్నే వెన్న తింటే బరువు తగ్గుతారా? నిపుణులు చెబుతోంది ఇదే..!

వైట్ బటర్‌తో నేరుగా బరువు తగ్గరని నిపుణుల సూచన

కొంతసేపు ఆకలి తగ్గించొచ్చని వివరణ

వెన్నలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయని వెల్లడి

అధికంగా తింటే ఎల్‌డీఎల్ పెరగొచ్చని హెచ్చరిక

కొలెస్ట్రాల్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచన



ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఓ చెంచా ఉప్పు లేని తాజా వెన్న (వైట్ బటర్).. ఈ మధ్య సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆరోగ్య చిట్కాల్లో ఒకటి. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మేలు చేస్తుందని కొందరు చెబుతున్నారు. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తుందని ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాత్రం వెన్నలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది కాబట్టి కొలెస్ట్రాల్ పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఈ రెండింటిలో నిజం ఏది?

ఆకలి తగ్గొచ్చా?



వైట్ బటర్‌లో కొవ్వు అధికంగా ఉంటుంది. దీన్ని తినడం వల్ల జీర్ణక్రియ కొంత నెమ్మదిగా సాగవచ్చు. దీంతో కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండొచ్చు. ఫలితంగా మధ్యలో ఎక్కువగా తినాలనే కోరిక తగ్గే అవకాశం ఉంది. ఈ కారణంగా బరువు నియంత్రణకు పరోక్షంగా ఉపయోగపడొచ్చు. అయితే వెన్న తినడం వల్ల శరీరంలోని కొవ్వు నేరుగా కరిగిపోతుందని మాత్రం చెప్పలేం.



వెయిట్ లాస్‌కు అసలు లెక్క ఇదే

బరువు తగ్గాలంటే రోజులో తీసుకునే క్యాలరీల కంటే ఖర్చయ్యే కేలరీలు ఎక్కువగా ఉండాలి. వైట్ బటర్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మోతాదుకు మించి తీసుకుంటే బరువు తగ్గడం కష్టమవుతుంది. పైగా ఇతర కొవ్వు పదార్థాలతో కలిపి ఎక్కువగా తీసుకుంటే క్యాలరీల మోతాదు మరింత పెరుగుతుంది. కాబట్టి వైట్ బటర్‌ను బరువు తగ్గించే ఆహారంగా చూడటం సరైంది కాదని నిపుణులు వివరిస్తున్నారు.

కొలెస్ట్రాల్ సంగతేంటి?

వైట్ బటర్‌లో సంతృప్త కొవ్వులు (శాచురేటెడ్ ఫ్యాట్స్) ఉంటాయి. ఎక్కువగా తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఊబకాయం ఉన్నవారు, గుండె జబ్బుల ముప్పు ఉన్నవారు కూడా మోతాదును నియంత్రించాలి.

ఎవరైనా తినొచ్చా?

వైట్ బటర్‌లో కొవ్వులో కరిగే కొన్ని విటమిన్లు ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. అయితే ప్రతి ఒక్కరికీ ఒకే మోతాదు సరిపోదు. కొలెస్ట్రాల్ లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది.

ఎలా తీసుకుంటే మంచిది?

వైట్ బటర్‌ను తక్కువ మోతాదులో తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. సంపూర్ణ ధాన్యాలతో చేసిన రొట్టె, ప్రొటీన్ ఉన్న అల్పాహారం లేదా చిరుధాన్యాల ఆహారంతో కలిపి తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన ఆహారాలతో పాటు ఎక్కువ మొత్తంలో తినకపోవడం అవసరం. మొత్తంగా చూస్తే.. ఖాళీ కడుపుతో వైట్ బటర్ తినడం వల్లే బరువు తగ్గుతామని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవు. మితంగా తీసుకుంటే ఆహారంలో భాగంగా ఉండొచ్చు. మోతాదు పెరిగితే మాత్రం క్యాలరీలు, కొలెస్ట్రాల్ రెండూ సమస్యగా మారొచ్చు.

## షుగర్ ఫ్రీ అంటూ లాగిస్తున్నారా? గుండెపోటు, స్ట్రోక్‌తో లింక్..

# తాజా స్టడీలో సంచలన విషయాలు!



స్వీట్‌నర్ జైలిటాల్‌పై ఆందోళన కలిగిస్తున్న కొత్త అధ్యయనం

ఇది గుండెపోటు, స్ట్రోక్ ముప్పుతో ముడిపడినట్లు గుర్తింపు

జైలిటాల్ రక్తం గడ్డకట్టే అవకాశాన్ని పెంచొచ్చన్న పరిశోధకులు

అధ్యయనంలో 17,710 మంది డేటా విశ్లేషణ

షుగర్ ఫ్రీ ఉత్పత్తుల్లో జైలిటాల్ విస్తృత ఉపయోగం

చక్కెర లేని గమ్.. మింట్స్.. బేకరీ పదార్థాలు.. టూత్‌పేస్ట్.. వీటిలో కనిపించే ఓ స్వీట్‌నర్‌పై ఇప్పుడు ఆందోళన మొదలైంది. తక్కువ కేలరీలు ఉంటాయని విస్తృతంగా వాడుతున్న జైలిటాల్ కు గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన గుండె సంబంధిత సమస్యల ముప్పుతో సంబంధం ఉన్నట్లు కొత్త అధ్యయనం సూచించింది. జర్మనీలో జరిగిన యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ (ఈఎస్‌సీ) కాంగ్రెస్‌లో ఈ పరిశోధన వివరాలను వెల్లడించారు. జైలిటాల్ రక్తంలోని ప్లేట్‌లెట్లు సులభంగా గడ్డకట్టేలా చేయొచ్చని పరిశోధకులు గుర్తించారు. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ముప్పు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. జైలిటాల్ సహజంగానే కొన్ని పండ్లు, కూరగాయల్లో స్వల్పంగా ఉంటుంది. మన శరీరం కూడా జీవక్రియలో భాగంగా కొద్దిమొత్తంలో దీన్ని తయారు చేస్తుంది. అయితే పరిశ్రమల్లో పెద్ద మొత్తంలో తయారు చేసి పలు ఆహార ఉత్పత్తుల్లో స్వీట్‌నర్‌గా కలుపుతున్నారు. చక్కెరతో పోలిస్తే ఇందులో దాదాపు 40 శాతం తక్కువ కేలరీలు ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను కూడా పెద్దగా పెంచదు. దీంతో షుగర్ ఫ్రీ ఉత్పత్తుల్లో దీని వాడకం పెరిగింది. కెనడా, యూరప్‌లో నిర్వహించిన రెండు దీర్ఘకాలిక అధ్యయనాల నుంచి 17,710 మంది వివరాలను పరిశోధకులు విశ్లేషించారు. గతంలో అధిక ప్రమాదం ఉన్న వ్యక్తుల్లో రక్తంలో జైలిటాల్ స్థాయిలు గుండె సంబంధిత సమస్యలతో ముడిపడి ఉన్నట్లు గుర్తించామని బెర్లిన్‌లోని చారిటే యూనివర్సిటీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ మార్కో విట్కోవ్‌స్కీ తెలిపారు. అయితే జైలిటాల్ నేరుగా గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమవుతుందని ఈ పరిశోధన నిరూపించలేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రస్తుత ఫలితాలు బలమైన సంబంధాన్ని మాత్రమే చూపుతున్నాయని చెప్పారు. ఉత్పత్తుల్లో జైలిటాల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దీని దీర్ఘకాలిక ప్రభావాలపై మరిన్ని పరిశోధనలు అవసరమని పేర్కొన్నారు.

# సప్లిమెంట్లు వద్దు.. ఈ సహజ ఆహారాలతోనే సంపూర్ణ ఆరోగ్యం!

- సప్లిమెంట్ల కన్నా సహజ ఆహారంతోనే పోషకాలు సులభంగా అందుతాయంటున్న నిపుణులు
- జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన
- ఐరన్ కోసం మునగాకు-బీట్‌రూట్, కాల్షియం కోసం రాగి-నువ్వుల మిశ్రమం ఉత్తమం
- విటమిన్ సి కోసం ఉసిరి, మల్టీవిటమిన్ల కోసం మిశ్రమ విత్తనాలు మేలని సూచన

వైద్యుల సలహా లేకుండా సప్లిమెంట్లు వాడటం ప్రమాదకరమని హెచ్చరిక



సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు దేశవ్యాప్తంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు కీలకమైన అంశాన్ని నొక్కి చెబుతున్నారు. కృత్రిమంగా తయారుచేసిన సప్లిమెంట్లపై ఆధారపడటం కంటే పోషకాలు అధికంగా ఉండే సహజమైన ఆహార పదార్థాల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. రోజూవారీ అవసరాలకు అవసరమైన పోషకాలను సహజ ఆహారం ద్వారానే సమర్థవంతంగా పొందవచ్చని సూచిస్తున్నారు.

సప్లిమెంట్లపై ఆధారపడటాన్ని తగ్గించి, మనకు అందుబాటులో ఉండే ఐదు రకాల ఆహార పదార్థాలతో పోషకాహార లోపాన్ని ఎలా అధిగమించవచ్చో నిపుణులు వివరించారు.

1. ఐరన్ కోసం: ఐరన్ టాబ్లెట్లు వాడటం వల్ల చాలామందిలో గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీనికి బదులుగా తాజా మునగాకు, పచ్చి బీట్‌రూట్ మిశ్రమానికి కొద్దిగా నిమ్మరసం కలిపి తీసుకోవాలి. మునగాకు, బీట్‌రూట్‌లోని ఐరన్‌ను శరీరం సులభంగా గ్రహించడానికి నిమ్మరసంలోని విటమిన్ సి ఎంతగానో సహాయపడుతుంది.

2. కాల్షియం కోసం: ఎముకల ఆరోగ్యానికి కాల్షియం అత్యవసరం. దీనికోసం నువ్వులు, రాగులను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిలో శరీరం సులభంగా గ్రహించగలిగే కాల్షియంతో పాటు మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్ వంటివి కూడా లభిస్తాయి. అధిక మోతాదులో కాల్షియం సప్లిమెంట్లు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలను దీని ద్వారా నివారించవచ్చు.

3. విటమిన్ సి కోసం: విటమిన్ సి కోసం మార్కెట్లో దొరికే మాత్రలకు బదులుగా తాజా ఉసిరికాయ లేదా బాగా పండిన జామపండు తినడం ఉత్తమం. ఒక చిన్న ఉసిరికాయలో అధిక స్థాయిలో సహజ విటమిన్ సి ఉంటుంది. దీనిలోని ఫ్లేవనాయిడ్లు, టానిన్లు జీర్ణక్రియ సమయంలో విటమిన్ సి నష్టపోకుండా కాపాడతాయి.

4. మల్టీవిటమిన్ల కోసం: రకరకాల మల్టీవిటమిన్ టాబ్లెట్లు వాడే బదులు, గుప్పెడు మిశ్రమ విత్తనాలు తీసుకోవడం ఎంతో మేలు. గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవిసె గింజల మిశ్రమం ద్వారా సహజమైన విటమిన్ ఇ, జింక్, మెగ్నీషియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు సమతుల్య రూపంలో శరీరానికి అందుతాయి.

5. ప్రొబయోటిక్స్ కోసం: పేగుల ఆరోగ్యానికి మేలు చేసే ప్రొబయోటిక్స్ కోసం సంప్రదాయ పద్ధతుల్లో పులియబెట్టిన ఆహారాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇంట్లో తయారుచేసిన పెరుగు, చద్దన్నం, నల్ల క్యారెట్ కంజి వంటివి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు మేలు చేసే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా లభిస్తుంది. అయితే, వైద్య పరీక్షల్లో పోషకాహార లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయినప్పుడు, గర్భధారణ సమయంలో లేదా కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడటం తప్పనిసరి అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సాధారణ ఆరోగ్య పరిరక్షణకు మాత్రం రంగురంగుల సహజమైన, సంపూర్ణ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడమే స్థిరమైన మార్గమని వారు సలహా ఇస్తున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆహారపు అలవాట్లలో పెద్ద మార్పులు చేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యులను లేదా డైటీషియన్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## వంటింటిపై ధరల పిడుగు..

## ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

సామాన్యుడి వంటింట్లో ధరల మంట

నెల రోజుల్లోనే రెట్టింపు స్థాయికి చేరిన ఉల్లి ధర

వినియోగదారుడి జేబుకు చిల్లు

రైతుకు గిట్టుబాటుతో ఆనందం

వర్షాభావంతో భారీగా పడిపోయిన దిగుబడులు

కొత్త పంట వచ్చేవరకు ధరలు తగ్గవంటున్న అధికారులు



సామాన్యుడి వంటింట్లో ధరల మంట రాజుకుంది. నిత్యావసరాలైన ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర నెల రోజుల వ్యవధిలోనే రెట్టింపు కావడంతో వినియోగదారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయితే, ఈ ధరల పెరుగుదల రైతులకు మాత్రం ఊరటనిస్తోంది. హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెల క్రితం క్వింటాల్ రూ. 2,000 ఉన్న మహారాష్ట్ర ఉల్లి ధర, ఇప్పుడు ఏకంగా రూ. 5,000 మార్కును తాకింది. ఏడాది కాలంలో ఇదే గరిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి బాటలోనే అల్లం, వెల్లుల్లి కూడా పయనిస్తున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన అల్లం క్వింటాల్ రూ. 16,000 పలుకుతుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అయిన వెల్లుల్లి ధర క్వింటాల్‌కు రూ. 19,000గా నమోదైంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ. 250 దాటిపోయింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలో గత జూన్, జులై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. మరోవైపు, కర్ణాటక, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ఫలితంగా, రోజుకు 20 వేల క్వింటాళ్లు రావాల్సిన మలక్‌పేట మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం 5 వేల క్వింటాళ్ల ఉల్లి మాత్రమే వస్తోంది. ధరల పెరుగుదల వినియోగదారులకు భారంగా మారినప్పటికీ, రైతులకు మాత్రం ఆనందాన్నిస్తోంది. గతంలో గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపై పారబోసిన రైతులు, ఇప్పుడు మంచి ధర దక్కుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరలు తగ్గకపోవచ్చని, ఈ భారం తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

## ఇంటి కొనుగోలుదారులకు భారీ ఊరట..

## బ్రోచర్‌లోని హామీలు నెరవేర్చాల్సిందేనన్న సుప్రీంకోర్టు

డీఎల్‌ఎఫ్ గురుగ్రామ్ ప్రాజెక్టు వివాదంపై కీలక వ్యాఖ్యలు

బ్రోచర్‌లో చూపిన 24 మీటర్ల రోడ్డును నిర్మించకపోవడాన్ని తప్పుబట్టిన న్యాయస్థానం

ఇది చిన్న మార్పు కాదని, చాలా కీలకమైనదని కోర్టు అభిప్రాయం

హామీ మేరకు ప్రాజెక్టును మార్చకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



ఢిల్లీ: రియల్ ఎస్టేట్ డెవలపర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక జారీ చేసింది. ప్రాజెక్టుల బ్రోచర్లలో, ప్రచార సామగ్రిలో ఇచ్చే హామీలను కేవలం మార్కెటింగ్ జిమ్మిక్కులుగా చూడటానికి వీల్లేదని, కొనుగోలుదారులకు చెప్పిన ప్రతి అంశాన్ని కచ్చితంగా నెరవేర్చాలని స్పష్టం చేసింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 82ఎలో డీఎల్‌ఎఫ్ హోమ్ డెవలపర్స్ నిర్మించిన 'ది ప్రైమస్' రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు సంబంధించిన వివాదంలో ఈ తీర్పు వెలువడింది. ప్రాజెక్టు బ్రోచర్‌లో చూపిన 24 మీటర్ల వెడల్పున్న రోడ్డును వాగ్దానం చేసినట్లు నిర్మించకపోవడమే ఈ వివాదానికి మూలకారణం. ఈ మార్పు చిన్నది కాదని, చాలా కీలకమైనదని జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కోర్టు ఆదేశాల మేరకు జరిగిన సీబీఐ ప్రాథమిక విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సుమారు 147 మీటర్ల పొడవున ఉండాల్సిన రోడ్డులో 52 మీటర్ల భాగాన్ని గ్రీన్ ప్యాచ్‌గా మార్చారు. మరో భాగాన్ని నివాసితులు, సందర్శకుల వాహనాల పార్కింగ్ కోసం వాడుతున్నారు. అంటే, బ్రోచర్‌లో చూపిన విధంగా రోడ్డు దాదాపుగా లేనట్లేనని నివేదిక తేల్చింది. బ్రోచర్లలోని హామీలను చూసే ప్రజలు ఫ్లాట్లు కొంటారని, వాటికి అనుగుణంగానే ప్రాజెక్టులను నిర్మించి అందించాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణలోగా బ్రోచర్‌లో చెప్పినట్లుగా ప్రాజెక్టులో మార్పులు చేయకపోతే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని డీఎల్‌ఎఫ్‌ను హెచ్చరించింది. 2012లో ఈ ప్రాజెక్టును ప్రారంభించగా, పలువురు కొనుగోలుదారులు ముందుగా జాతీయ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఆ తర్వాత ఇరు పక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి విచారణను అక్టోబర్ 12, 2026కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది.

## జైశంకర్‌తో భేటీ.. భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ

భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ

బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ

శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది. భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# నేపాల్ వరద విలయం

## వందలాది చిన్నారుల గల్లంతు.. కష్టంగానే ఆచూకీ!

నేపాల్-చైనా సరిహద్దులో ఘోర వరద విపత్తు

వందలాది చిన్నారులు సహా 5,000 మందికి పైగా గల్లంతు

ధ్వంసమైన నెట్‌వర్క్‌లతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం

17,000 మంది పిల్లలకు తక్షణ సహాయం అవసరమన్న యూనిసెఫ్

మృతుల సంఖ్య 1,200 దాటడంతో కొనసాగుతున్న సహాయక చర్యలు



నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు.

ఆగస్టు 26న నేపాల్-చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనా-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 4,000 నుంచి 5,000 మధ్య ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు.

ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి.

గల్లంతైన వారిని కనుగొనడంలో 'తెగిపోయిన నెట్‌వర్క్‌లు' అతిపెద్ద సవాలుగా మారాయి. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

## జీతం లేని పనిలో భారతీయులే టాప్..

## వారానికి 16 గంటలకు పైగా వెట్టిచాకిరి.. నివేదికలో షాకింగ్ నిజాలు!

జీతం లేని పని గంటల విషయంలో భారతీయులు ప్రపంచంలోనే మొదటి స్థానం

ప్రతి నలుగురు భారత ఉద్యోగుల్లో ఒకరు వారానికి 16 గంటలకు పైగా ఉచితంగా పనిచేస్తున్న వైనం

ఎక్కువ గంటలు పనిచేస్తున్నా ఉత్పాదకత పెరగడం లేదని తేల్చిన అధ్యయనం

రిమోట్ వర్క్ చేసే ఉద్యోగులు, యువతలోనే ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని వెల్లడి

పనిభారం, ఒత్తిడి కారణంగా ఉద్యోగాలు మానేయాలని చాలామంది ఆలోచిస్తున్నట్లు స్పష్టీకరణ






పని విషయంలో భారతీయులు ఎంతో కష్టపడతారని పేరుంది. అయితే ఈ కష్టంలో అధిక భాగం జీతం లేకుండానే జరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి సంచలన విషయాలను వెల్లడించింది. ఏడీపీ సంస్థ విడుదల చేసిన 'పీపుల్ ఎట్ వర్క్ 2026' నివేదిక ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా జీతం లేని పని గంటలు నమోదు చేస్తున్న దేశంగా భారత్ నిలిచింది. వారానికి 16 గంటలకు పైగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా పనిచేస్తున్న ఉద్యోగులు మన దేశంలోనే ఎక్కువగా ఉన్నారని ఈ రిపోర్ట్ స్పష్టం చేసింది.

భారత్‌లో ప్రతి నలుగురు ఉద్యోగుల్లో ఒకరు (24శాతం) వారానికి 16 లేదా అంతకంటే ఎక్కువ గంటలు ఉచితంగా పనిచేస్తున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. మరో 40శాతం మంది ఉద్యోగులు వారానికి 6 నుంచి 15 గంటల పాటు జీతం లేని అదనపు పని చేస్తున్నారు. అంటే, మన దేశంలోని అధిక శాతం శ్రామిక శక్తి గణనీయమైన సమయాన్ని ఎలాంటి వేతనం లేకుండానే పనికి కేటాయిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఈ పరిస్థితి భిన్నంగా ఉంది. అంతర్జాతీయంగా కేవలం 12 శాతం మంది మాత్రమే వారానికి 16 గంటలకు పైగా అదనపు పని చేస్తున్నారు.

అయితే, ఎక్కువ గంటలు పనిచేస్తే ఎక్కువ ఫలితాలు వస్తాయనుకుంటే పొరపాటేనని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. అదనపు పనిభారం మోస్తున్న ఉద్యోగులు తాము అనుకున్నంత ఉత్పాదకతను చూపలేకపోతున్నామని అంగీకరించారు. ఇలాంటి వారిలో తీవ్రమైన ఒత్తిడి, ఉద్యోగం మారాలనే ఆలోచనలు కూడా అధికంగా ఉన్నట్లు తేలింది. జీతం లేని పని గంటలు ఎక్కువగా ఉన్నవారు తమ ఉద్యోగంలో నిబద్ధత, సంతృప్తిని పొందుతున్నామని చెబుతున్నప్పటికీ, వారిలో ఉత్పాదకత తక్కువగా ఉండటం, మానసిక శ్రేయస్సు తగ్గడం, కొత్త ఉద్యోగం కోసం వెతికే ధోరణి పెరగడం వంటివి గమనించారు.

ముఖ్యంగా ఇంటి నుంచి పనిచేసే (రిమోట్) ఉద్యోగులు, యువతలోనే ఈ అదనపు పని గంటల ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ఆఫీసుకు వచ్చి పనిచేసే వారితో పోలిస్తే రిమోట్ వర్కర్లే ఎక్కువ గంటలు ఉచితంగా పనిచేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ గణాంకాలు కంపెనీలకు ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. ఉద్యోగుల పనితీరును కేవలం హాజరు లేదా లాగిన్ అయిన గంటలతో అంచనా వేయడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. జీతం లేని పని గంటలు పెరిగేకొద్దీ అది ఉద్యోగుల ఉత్పాదకత, వారి శ్రేయస్సుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, చివరికి వారు కంపెనీని వీడిపోయేందుకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

## ఇరాన్‌పై ఉచ్చు బిగిస్తున్న అమెరికా..

## 2027 వరకు బలగాల మోహరింపు పొడిగింపు!

ఇరాన్‌పై వ్యూహంలో భాగంగా 50,000 మంది సైనికులు, 19 యుద్ధ నౌకల మోహరింపు

సైనికుల సేవా కాలం పొడిగింపుతో వారిపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి

సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే అమెరికా లక్ష్యం

ఎప్పుడైనా దాడికి సిద్ధమంటూ ఇరాన్‌కు ట్రంప్ బహిరంగ హెచ్చరిక



పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో మోహరించిన తమ సైనిక బలగాల గడువును 2027 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు యుద్ధ విషయంలో మరిన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక సైనిక వ్యూహంలో భాగమని 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో వెల్లడించింది. ఇరాన్‌పై సైనిక చర్యలు, ఆర్థిక ఒత్తిడి, అవసరమైతే విస్తృత స్థాయి యుద్ధం వంటి అంశాలను ట్రంప్ పరిశీలనలో ఉంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మొదట ఇరాన్‌పై స్వల్పకాలిక, నిర్ణయాత్మక సైనిక చర్యగా ప్రచారం చేసినప్పటికీ, ఇప్పుడు ఈ మోహరింపు భారీగా విస్తరించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో సుమారు 50,000 మంది అమెరికా సైనికులు, 19 యుద్ధ నౌకలు, ఫైటర్ స్క్వాడ్రన్లు, వాయు రక్షణ విభాగాలు, పారాట్రూపర్లు మోహరించి ఉన్నారు. ఈ సుదీర్ఘ మోహరింపు కారణంగా అమెరికా సైనికులు, వారి కుటుంబాలు, సైనిక పరికరాలపై తీవ్ర భారం పడుతోందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. ఆర్మీ ఎయిర్ డిఫెండర్ల సేవా కాలాన్ని 9 నెలల నుంచి 12 నెలలకు పెంచారు. యూరప్, పసిఫిక్ ప్రాంతాల నుంచి వచ్చిన కొన్ని యూనిట్లు ఏడాదికి పైగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాయి. నౌకాదళం కూడా ఇదే విధమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం రెండు విమానవాహక నౌకలు, 13 గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్‌లతో సహా మొత్తం 19 యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. యుద్ధం ప్రారంభంలో పంపిన యూఎస్ఎస్ డెల్బర్ట్ డి. బ్లాక్, యూఎస్ఎస్ స్ప్రూయన్స్ వంటి నౌకలు, వాటిలోని 300 మంది సిబ్బంది నెలల తరబడి విరామం లేకుండా సముద్రంలోనే గడుపుతున్నారు. అదే సమయంలో ట్రంప్ యంత్రాంగం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ప్రయోగించడం ద్వారా ఆ దేశ నాయకత్వాన్ని తిరిగి చర్చల టేబుల్‌పైకి తీసుకురావాలని వ్యూహరచన చేస్తోంది. ఆర్థిక ఒత్తిడితోనే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తుందని, అందుకే ఈ యుద్ధాన్ని ముగిసినట్లుగా ప్రకటించడంపై ట్రంప్ తన సీనియర్ సహాయకులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "హర్మూజ్ జలసంధిపై మాకు పూర్తి నియంత్రణ ఉంది. వాళ్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఇరాన్ ప్రజలు ఎప్పుడు తిరుగుబాటు చేస్తారు?" అని రాశారు.

బుధవారం ఆయన మాట్లాడుతూ.. "ఎప్పుడైనా, ఎక్కడైనా దాడులు చేసేందుకు అమెరికా పూర్తి సన్నద్ధంగా ఉంది. మేము వారి రాడార్ వ్యవస్థను ధ్వంసం చేశాం. వాళ్లు ఏం చేస్తున్నారో మాకు అన్నీ తెలుసు. వాళ్లు బాత్రూమ్‌కు వెళ్లినా మేము చూడగలం" అని వ్యాఖ్యానించారు. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికలపై ఈ యుద్ధం ప్రతికూల ప్రభావం చూపుతుందని ట్రంప్ సహాయకులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని తాను నిర్ణయాలు తీసుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసి, ఆ దేశ వాణిజ్య భాగస్వాములపై ఆంక్షలు విధించడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్నది అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది.

# నిధి అగర్వాల్ కొత్త సినిమా.. ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!



వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న సినిమా
నిధి పుట్టినరోజున ప్రారంభమైన చిత్రీకరణ
సినిమాకు శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం
హీరోయిన్ ప్రధానంగా సాగే కథ

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది. సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.





సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

# 'సలార్ 2'పై బిగ్ అప్డేట్.. అదే టైమ్‌లో రిలీజ్ కన్‌ఫర్మ్!






ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్, మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'సలార్ 2: శౌర్యాంగపర్వం'. మొదటి భాగం 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' థియేటర్లలో తెచ్చిన తుఫాన్ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ సీక్వెల్ షూటింగ్ రిలీజ్ కి సంబంధించి, ఒక సాలిడ్ అప్డేట్ బయటకు వచ్చింది. ఈ వార్తతో ప్రభాస్ అభిమానుల్లో ఒక్కసారిగా పండగ వాతావరణం నెలకొంది. మరి ఆ అప్డేట్ పైన మనము ఓ లుక్ వేద్దాం.. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న 'సలార్ 2' షూటింగ్ ఇప్పటికే కొంత భాగం పూర్తయింది. మిగతా చిత్రీకరణను వచ్చే ఏడాదిలోనే అంటే 2027లో పూర్తి చేయాలని మేకర్స్ గట్టిగా డిసైడ్ అయ్యారు. ఇక ఖాన్సార్ సామ్రాజ్యంలో దేవ, వరదరాజ మన్నార్ ల మధ్య రాబోయే అసలైన యుద్ధం కోసం ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ తాజా క్లారిటీతో సినిమాపై మరింత హైప్ పెరిగింది. ఎన్టీఆర్ సినిమాతో ప్రశాంత్ నీల్ బిజీ: ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో కలిసి 'డ్రాగన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుండగా, 2027 ప్రారంభం నాటికే దీన్ని పూర్తి చేయాలని నీల్ ప్లాన్ చేస్తున్నారు. ఆ సినిమా పనులు ముగియగానే ప్రశాంత్ నీల్ తన దృష్టినంతా పూర్తిగా 'సలార్ 2' పైనే పెట్టనున్నారు. వరుస ప్రాజెక్టులతో ప్రభాస్ హడావిడి: మరోవైపు ప్రభాస్ కూడా తన చేతిలో ఉన్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఫౌజీ' చిత్రం ముగింపు దశకు చేరుకుంది. అలాగే 'స్పిరిట్', 'కల్కి 2' చిత్రాల షూటింగ్‌లు కూడా రీసెంట్‌గానే మొదలయ్యాయి. ప్రశాంత్ నీల్ వచ్చేలోగా ప్రభాస్ తన 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్ ఒక కొలిక్కి తీసుకురానున్నారు.

# 25వ సినిమా.. చైతూ ఏ లెక్కలో వెళ్తాడో!



అందుకే వృషకర్మ తర్వాత వచ్చే 25వ సినిమా మీద ఫ్యాన్స్ లెక్క కూడా కాస్త వేరుగా ఉంటుంది. మైల్‌స్టోన్ కాబట్టి భారీ బడ్జెట్ ఉండాలనే రూల్ ఏమీ లేదు. కానీ ముందు సినిమా విజువల్‌గా పెద్ద స్థాయిలో ఉండి, బాక్సాఫీస్ దగ్గర కూడా మంచి రిజల్ట్ ఇస్తే తర్వాత వచ్చే సినిమాకు అంచనాలు ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. అప్పుడు 25వ సినిమా కోసం చైతూ ఎలాంటి కథ ఎంచుకుంటాడన్నదే ఎక్కువ ఆసక్తి

నాగచైతన్య కెరీర్ ఇప్పుడు 25వ సినిమా దగ్గరకు వచ్చేసింది. మైల్‌స్టోన్ నంబర్ కావడంతో సహజంగానే ఫ్యాన్స్‌లో కాస్త ఎక్కువ అంచనాలు ఉంటాయి. అయితే అంతకంటే ముందు చైతూ చేస్తున్న వృషకర్మ కూడా చిన్న సినిమా కాదు. తండేల్ తో ఇప్పటికే వంద కోట్ల క్లబ్ చూసిన చైతూ, ఇప్పుడు తన కెరీర్‌లోనే పెద్ద కాన్వాస్‌లో కనిపించే సినిమాతో ముందుకు వస్తున్నాడు. విరూపాక్షతో తొలి సినిమాకే వంద కోట్ల రేంజ్ చూసిన కార్తీక్ దండు వృషకర్మను తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటివరకు బయటకు వచ్చిన కంటెంట్‌లో మిస్టరీ, అడ్వెంచర్, గ్రాఫిక్స్‌కు మంచి స్పేస్ కనిపిస్తోంది. చైతూ కూడా ఇంతకుముందు చేయని ప్రపంచంలోకి వెళ్లాడు. సినిమా కంటెంట్ క్లిక్ అయితే తండేల్ తర్వాత ఆయన మార్కెట్‌ను మరో మెట్టు ఎక్కించే అవకాశం దీనికి ఉంది. పెంచుతుంది. ఇక్కడే వెంకీ అట్లూరి పేరు వినిపిస్తోంది. నాగవంశీ నిర్మాణంలో చైతూ 25వ సినిమాను వెంకీ డైరెక్ట్ చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇంకా అధికారికంగా ఏమీ ఫిక్స్ కాలేదు. కానీ ఈ కాంబినేషన్ నిజమైతే ఫ్యాన్స్ లో అంచనాలు మళ్ళీ మరోలా పెరుగుతాయి. వృషకర్మ తరహా భారీ అడ్వెంచర్ తర్వాత వెంకీ అదే రూట్‌లో వెళతాడా అనేది అసలు డౌట్

# రాశి ఖన్నా స్టన్నింగ్ లుక్స్.. సోషల్ మీడియాలో క్రేజీ ఫొటోలు





టాలీవుడ్ అందాల భామ రాశి ఖన్నా సరికొత్త గ్లామరస్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆమె అద్భుతమైన అందాలు, స్టైలిష్ లుక్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. వింటేజ్, వింటర్-చిక్ శైలిలో ఆమె పంచుకున్న ఈ లేటెస్ట్ పిక్స్ ప్రస్తుతం నెట్టంట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రాశి ఖన్నా గ్లామర్, ఆమె ఫ్యాషన్ సెన్స్ చూసి నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తూ ఈ ఫొటోలను తెగ ట్రెండ్ చేస్తున్నారు. 5 అదిరిపోయే డ్రెస్సింగ్ స్టైల్ : ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో రాశి ఖన్నా ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భుజాలపై నుండి జారిపడేలా డిజైన్ చేసిన ఎరుపు రంగు శాలువాను టాప్‌లా స్టైల్ చేయగా, దానికి మ్యాచింగ్‌గా హై-వేస్ట్ బ్లాక్ అండ్ వైట్ ప్లీటెడ్ చెకర్డ్ మిడ్డీ స్కర్ట్ ధరించారు. ఇక ఈ కలర్ కాంబినేషన్ ఆమెకు వింటాజ్ లుక్‌తో పాటు రాయల్ ఎలిగెన్స్ తెచ్చిపెట్టింది. అలరిస్తున్న మేకప్, హెయిర్ స్టైల్: సాఫ్ట్ వేవీ హెయిర్, వార్మ్ బ్రాంజ్ మేకప్, ఫ్లష్ నూడ్ లిప్‌స్టిక్‌తో రాశి చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, చూపులతోనే మాయ చేసేలా ఉంది. ఇక సౌత్ నుంచి నార్త్ వరకు అన్ని భాషల ప్రేక్షకులను తన నటనతో, అందంతో మెప్పిస్తున్న రాశి ఖన్నా, ఫ్యాషన్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. చేతినిండా క్రేజీ ప్రాజెక్టులు: ప్రస్తుతం రాశి ఖన్నా కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఆమె వరుసగా పెద్ద సినిమాల్లో నటిస్తున్నారు. రాశి ఖన్నా తమిళంలో 'అగత్య', తెలుగులో 'తెలుసు కదా' అలాగే వార్ డ్రామా '120 బహదూర్' సినిమాల్లో నటించి మెప్పించారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఉస్తాద్ భగత్ సింగ్'లో కూడా నటించారు. ఇక రజనీకాంత్‌తో 'ధర్మన్' మూవీలో నటిస్తూ భారీ ప్రాజెక్టులను తన ఖాతాలో వేసుకున్నారు. గతంలో షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి నటించి మంచి విజయం సాధించిన 'ఫర్జీ' సిరీస్‌కు సీక్వెల్‌గా రాబోతున్న 'ఫర్జీ 2' షూటింగ్‌లో తాజాగా ఆమె పాల్గొంటున్నారు. ఇందులో ఆమె 'మేఘా వ్యాస్' అనే పాత్రలో మరోసారి మెప్పించనున్నారు. ఈ విషయాన్ని రాశి స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఇటీవల వెల్లడించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు గ్లామరస్ ఫొటోషూట్‌లతో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ, మరోవైపు వైవిధ్యమైన సినిమాలతో దూసుకుపోతున్న రాశి ఖన్నా, రాబోయే

# డిలే భారాన్ని సంక్రాంతి మోయగలదా




సాయి దుర్గా తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు' సినిమాను ఇంకా ఎంత కాలం సాగదీస్తారు అనే టాక్ అయితే ఉంది. మొదట్లో ఈ మూవీని 2025 సెప్టెంబర్ 25న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఆ డేట్ వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ఈ ఏడాది జూన్ లో ఒక అప్డేట్ ఇస్తూ 2026 డిసెంబర్ లో థియేటర్లలోకి తీసుకొస్తామని చెప్పారు. కట్ చేస్తే ఇప్పుడు ఏకంగా 2027 జనవరి 12కి వాయిదా వేశారు. ఫైనల్ గా సినిమాను సంక్రాంతి బరిలో దించుతున్నారు. పండగ సీజన్ దొరకడం పెద్ద ప్లస్ పాయింట్ అయినా, ఇన్నాళ్ల డిలేని సంక్రాంతి అడ్వాంటేజ్ ఒక్కటే బ్యాలెన్స్ చేయగలదా అనే డౌట్ వస్తుంది. వచ్చే ఏడాది సంక్రాంతి రేసు ఇప్పటికే టైట్ అయిపోయింది. జనవరి 8న మహాకాళి థియేటర్లలోకి వస్తుంటే, శర్వానంద్ శ్రీను వైట్ల కాంబోలో తెరకెక్కిన జార్జ్ క్రిష్ జనవరి 14న రాబోతోంది. నాగార్జున కూడా సడన్ సర్ ప్రైజ్ ఇవ్వచ్చు. వీటికి తోడు వెంకటేష్ కళ్యాణ్ రామ్ లతో అనిల్ రావిపూడి చేస్తున్న మల్టీస్టారర్ సినిమా కూడా పండగనే టార్గెట్ చేసింది. రిలీజ్ టైమ్ కి వీటిలో ఎన్ని సినిమాలు రేసులో నిలబడతాయో ఇప్పుడే చెప్పలేం కానీ, బాక్సాఫీస్ దగ్గర మాత్రం గట్టి ఫైట్ తప్పదనే విషయం క్లియర్ గా తెలుస్తోంది. సంబరాల ఏటిగట్టు టీమ్ కు ఉన్న అసలు సమస్య రిలీజ్ డేట్ ఒక్కటే కాదు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్, క్యారెక్టర్ పోస్టర్లు ఎప్పుడో బయటకు వచ్చేశాయి. మధ్యలో ఇలా పదే పదే రిలీజ్ వాయిదా పడుతూ వస్తుంటే జనాల్లో ఆటోమేటిక్ గా ఆసక్తి తగ్గిపోతుంది. జనవరి వచ్చేసరికి ఇది ఎప్పటినుంచో నానుతున్న సినిమా అనే ఫీలింగ్ రాకుండా చూసుకోవాలి. ఇప్పుడే చూడాల్సిన ఫ్రెష్ మూవీ అనే వైబ్స్ క్రియేట్ చేయాలి. దానికి తగ్గట్టుగానే మేకర్స్ ప్రమోషనల్ కంటెంట్ ను చాలా కొత్తగా డిజైన్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. పండగ సీజన్ అనగానే బిజినెస్ పరంగా రేట్లు పెంచి అమ్ముకునే ఆస్కారం ఉంటుంది. అయితే ఇప్పటికే చాలా డిలే అయిన ప్రాజెక్ట్ కావడంతో, సంక్రాంతి పేరు చెప్పి థియేట్రికల్ టార్గెట్ ను అమాంతం పెంచేస్తే అసలుకే మోసం వస్తుంది. ఒకేసారి ఐదారు సినిమాలు థియేటర్లలో ఉన్నప్పుడు కచ్చితంగా స్క్రీన్స్ పంచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అలాంటప్పుడు సినిమా టాక్ కాస్త అటూ ఇటూగా ఉన్నా కలెక్షన్స్ రికవర్ చేసుకోవడానికి టైమ్ దొరకదు. కాబట్టి రేట్ల విషయంలో మేకర్స్ జాగ్రత్తగా అడుగులు వేయాలి. వరుస సెలవులు ఉండటం, ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కట్టడం వల్ల మంచి టాక్ వస్తే రెండో రోజు నుంచే కలెక్షన్స్ పికప్ అవుతాయి. ఈ సినిమా కోసం సాయి దుర్గా తేజ్ తన లుక్, ఫిజిక్ ను పూర్తిగా మార్చేశాడు. ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, శ్రీకాంత్, సాయికుమార్ లాంటి స్ట్రాంగ్ కాస్టింగ్ కూడా ఈ ప్రాజెక్ట్ లో ఉంది. కాబట్టి సినిమాలో కంటెంట్ పరంగా కావాల్సినంత స్టఫ్ ఉందనే చెప్పాలి.



# న్యూయార్క్‌లో 'ఇండియా డే పరేడ్'.. చీఫ్ గెస్ట్‌గా మెరిసిన పూజా హెగ్డే!




అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఆగస్టు 16న నిర్వహించిన 44వ 'ఇండియా డే పరేడ్' అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు టాలీవుడ్, బాలీవుడ్ నటి పూజా హెగ్డే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పసుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో ఆమె మెరిసిపోతూ భారతీయులందరినీ ఆకట్టుకున్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతిని చాటిచెప్పే ఈ వేడుకలో పూజా హెగ్డే సందడి చేయడం మనందరికీ ఎంతో గర్వకారణంగా మారింది. అమెరికా వీధుల్లో భారతీయ కోలాహలం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ (ఫీఐఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ పరేడ్, భారతదేశం వెలుపల జరిగే అతిపెద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఒకటిగా నిలిచింది. ఇక మాడిసన్ అవెన్యూలోని ఈస్ట్ 38వ వీధి నుండి ఈస్ట్ 27వ వీధి వరకు ఈ వేడుకలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. న్యూయార్క్ వీధులన్నీ భారతీయ జెండాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మారుమోగిపోయాయి. ప్రత్యేక ఇతివృత్తంతో స్వాతంత్ర్య వేడుకలు: ఈ ఏడాది వేడుకలను "సాంప్రదాయంలో సామరస్యం" అనే ప్రత్యేక ఇతివృత్తంతో నిర్వహించారు. భారతదేశ స్వాతంత్ర్య 80వ వార్షికోత్సవానికి చిహ్నంగా ఈ కార్యక్రమం నిలిచింది. ఇక విదేశాల్లో ఉంటున్న భారతీయులంతా ఒక్కటై తమ దేశభక్తిని, ఐక్యతను చాటుకోవడానికి ఈ వేడుక ఒక వేదికగా ఉపయోగపడింది. బుల్లితెర నటుల సందడి: ఈ పరేడ్‌లో పూజా హెగ్డేతో పాటు ప్రముఖ టీవీ సిట్‌కామ్ 'తారక్ మెహతా కా ఊల్టా చష్మా' నటీనటులు కూడా పాల్గొని రచ్చ చేశారు. దిలీప్ జోషి (జేఠాలాల్), బల్విందర్ సింగ్ సూరి (రోషన్ సింగ్), నితీష్ భలుని (టప్పు), సోనాలికా జోషి (మాధవి), అమిత్ భట్ (చంపక్‌లాల్) మరియు మందార్ చంద్వద్కర్ (భిడే) తమ నటనతో, సందడితో అభిమానులను అలరించారు. వేడుకల అనంతరం పూజా హెగ్డే అక్కడి ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "వేలాది మంది భారతీయులు న్యూయార్క్‌లో మన సంస్కృతిని గర్వంగా చూపించడం నిజంగా గొప్ప విషయం. ఇక ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొనడం నాకెంతో గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ తీపి జ్ఞాపకం నా గుండెల్లో ఎప్పటికీ ఉండిపోతుంది" అని ఆమె రాసుకొచ్చారు. గ్లోబల్ స్టేజ్‌పై భారతీయ అందం: గ్లోబల్ వేదికపై మన మాతృభూమికి ప్రాతినిధ్యం వహిస్తూ పూజా హెగ్డే ఎంతో గౌరవంగా, హుందాగా వ్యవహరించారు. పసుపు రంగు చీరలో ఆమెను చూసిన అభిమానులు "గ్లోబల్ స్టేజ్‌పై ఇండియాను ఎంతో చక్కగా రిప్రజెంట్ చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. విదేశీ గడ్డపై మన సంస్కృతిని సగర్వంగా చాటిచెప్పిన ఈ వేడుక ప్రతి ఒక్కరి హృదయాలను గర్వంతో నింపేసింది.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOL D.T. (A.P)-518343,CELL:9494741301.